విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

ఆదివారం 11 ఆగస్టు 2024 8 పేజీలు

పడకేసిన పారిశుద్ధ్యం

ప్రజారోగ్యం కాపాడుకునేందుకు ప్రజలంతా కలసిరావాలి : దోనేపూడి శంకర్ పిలుపు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: ఎన్టీఆర్ జిల్లాలో పారిశుధ్యం పడకేసిందని, ప్రజారోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రజలంతా ముందుకు రావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ పిలుపునిచ్చారు. విస్సన్నపేటలో శనివారం జరిగిన సీపీఐ మండలశాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ప్రాథమిక హక్కుగా ఉన్న రక్షిత నీటిని అందించటంలో పాలకులు విఫలమవు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎ.కొండూరుతో సహా జిల్లాలోని పలు మండలాల్లో సిలికాన్, ఫ్లోరైడ్‌తో నిండిన విషపూరిత నీటిని తాగుతూ గిరిజనులు మృత్యువాత -మిగతా 2 లో ...

వయనాడ్ బాధితుల కోసం
విరాళాల సేకరణ

విశాలాంధ్ర-పొన్నూరు: వయనాడ్ బాధితుల కోసం ఆర్థిక సహాయం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో శనివారం విరాళాల సేకరణ జరిగింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కేరళ -మిగతా 2 లో ...

ఎస్పీని కలిసిన జేసీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు.

క్రీడాకారులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : క్రీడాకారులు నిరంతరం పట్టుదలతో సాధన చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రముఖ సీనియర్ న్యాయవాది, సీపీఐ నాయకులు ఆర్.వెంకటేశ్వరరావు(ఆర్వీ) చెప్పారు. ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించే -మిగతా 2 లో ...

కొనసాగుతున్న వరద ఉధృతి

విశాలాంధ్ర-అవనిగడ్డ : గత 5 రోజులుగా కృష్ణమ్మకు వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. గడిచిన రెండు రోజులు 3 లక్షల క్యూసెక్కు పై చిలుకు సముద్రానికి విడుదల చేయడంతో కృష్ణమ్మ పరు గులు పెడుతూ సముద్రుడు చెంతకు చేరుతుంది. వరద ఉధృతికి మండల పరిధిలోని పాత ఎడ్లంక గ్రామానికి రహదారి కోసం నిర్మించిన కాజ్వే కొట్టుకుపోవడంతో పడవ ప్రయాణం చేయాల్సిన పరిస్థితులు గ్రామస్తులకు -మిగతా 2 లో ...

ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు జయప్రదం చేయండి

5

మంచి సినిమాలను
ప్రోత్సహించాలి

విశాలాంధ్ర-తెనాలి : మంచి సినిమాలను ప్రోత్సహించడమే ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీస్ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎఫ్ఎస్ఐ) ఉద్దేశమని ఎఫ్ఎఫ్ఎస్ఐ సదరన్ రీజియన్ సెక్రటరీ బీఎల్ఎస్ఎస్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. రాబోయే సంవత్సర కాలంలో నిర్వహించతలపెట్టిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిం చేందుకు తెనాలిలోని కల్చరల్ ఫిల్మ్ సొసైటీ కార్యాలయానికి -మిగతా 2 లో ...

టైల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు - 7లో..

రైతులను వేధిస్తున్న నీటి సమస్య

ఎండిపోతున్న వరినారుమళ్లు
ధ్వంసం చేస్తున్న రైతులు... పట్టించుకోని పాలకులు

విశాలాంధ్ర-కూచిపూడి : సాగునీరు రా(లే)క నారుమడులు ఎండిపోతూ దెబ్బతిన్న వరినారు మడులను ట్రాక్టర్‌తో దమ్ముచేసి తొలగించిన సంఘటన వేములమడ గ్రామంలో చోటు చేసుకుంది. శ్రీశైలం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు అన్ని గేట్లు ఎత్తివేయడంతో కృష్ణానది, వంటకాలవలు జలకళతో కొన సాగుతున్న ఈ తరుణంలో మొవ్వ మండలంలోని వేములమడ గ్రామంలో భీమనది డ్రైన్ రెగ్యులేటర్ కింద సాగునీరు అందకపోవటంతో వరినారు మడులు, నాటు వేసిన వరి పొలాలు ఎండిపోవటంతో సాగునీటి కోసం ఈ వారంలో రోడ్డెక్కి ధర్నా చేసిన సంగతి పాఠకులకు విదితమే. రెండు రోజుల్లో భీమనది ఛానల్ నుంచి డ్రైన్ వద్దగల రెగ్యులేటర్‌కు నీరు వదులుతామని అధికారులు పేర్కొన్నా.. నేటికీ అమలు కాలేదని ఆ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రెగ్యులేటర్ కింద సుమారు 80 ఎకరాల -మిగతా 2 లో ...

ఇంజినీరింగ్ మూడో విడత కౌన్సిలింగ్‌నకు చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు మూడవ విడత కౌన్సెలింగ్ నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌కు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి తరుపు రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ శనివారం లేఖ రాశారు. ఏపీ ఈఏపీసీఈటీ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశానికి ఇప్పటికే -మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

పడకేసిన పారిశుధ్యం

పడుతున్నారన్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 350మంది కేవలం శుభ్రమైన గుక్కెడు మంచినీరు దొరకని స్థితిలో విషంగా మారిన నీరు సేవించి చనిపోయారన్న విషయాన్ని అందరూ గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంకా వందల సంఖ్యలో కిడ్నీ వ్యాధులతో బాధపడుతూ, చావుబ్రతుకుల మధ్య జీవనం సాగిస్తున్నారన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఎ.కొండూరు మండలానికి స్వచ్ఛమైన నీరందించాలని సిపిఐ ఉద్యమించగా, కొన్ని కంటితుడుపు చర్యలు తీసుకున్నారన్నారు. తరువాతి వైసీపీ ప్రభుత్వం సైతం 51రోజుల్లో తిరువూరు నియోజకవర్గానికి కృష్ణాజలాలు అందిస్తామంటూ ఊరించి, ఉసూరుమనిపించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తక్షణచర్యలు చేపట్టాలనే డిమాండ్‌తో ఈనెల 27,28,29 తేదీల్లో ఎ.కొండూరు నుంచి విజయవాడ వరకు సిపిఐ పార్టీ పాదయాత్ర చేపట్టిందన్నారు. ప్రజలంతా ఈ పాదయాత్రకు సంఘీభావం తెలిపి, ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరారు. రైతుసంఘం నాయకుడు వేగి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తూము కృష్ణయ్య, జిల్లా నాయకులు షేక్ నాగుల్‌మీరా, చిలుకూరి వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి ఎం.త్యాగరాజు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు తదితరులు పాల్గొని మాట్లాడారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ

రాష్ట్రం వయనాడ్ జిల్లాలో అనేక గ్రామాలు ముంపుకు గురవటమే కాక కొండచరియలు విరిగిపడి నందు వలన అనేక గ్రామాలు స్మశానంగా మారాయని ఆంధ్ర ప్రదేశ్ ప్రజా నాట్యమండలి గుంటూరు జిల్లా కార్యదర్శి అరే టి రామారావు పేర్కొన్నారు. అనేక శవాలు ఇంకా శిధిలాల నుండి తీస్తున్నారని తల్లుల్లి కోల్పోయిన బిడ్డలు, ఎందరో అనాదులుగా మారారని, విపరీతమైన ప్రాణ నష్టం మరియు ఆస్తి నష్టం జరిగినందని వారిని ఆదుకొనే నిమిత్తం అనేక రాష్ట్రాల్లో, మన రాష్ట్రంలో ఇప్టా జాతీయ కౌన్సిల్ పిలుపుమేరకు బాధిత ప్రజలకోసం ప్రజలనుండి విరాళాలు సేకరించి వారికి పంపటము జరుగుతుందని, ప్రజలు అధిక సంఖ్యలో విరాళాలిచ్చి సహకరించ వలసినదిగా ఆయన విజ్ఞప్తి చేశారు. వయనాడ్ జిల్లాలో జరిగిన ప్రాణ, ఆస్తి నష్టం గురించి ప్రజా నాట్యమండలి కళాకారుడు గంటా రాజేంద్ర కుమార్ పాడిన బలై పోయారు..ఎందరో బలై పోయారు అనే పాటలు ప్రజలను బాగా ఆకట్టుకొని విరాళాలు సేకరించటానికి దోహదపడ్డాయన్నారు. ఈకార్యక్రమంలో గేయ రచియిత దేవరకొండ శ్రీనివాస్, గాయకులు చిట్టి బాబు భరత్ కుమార్, హనీఫ్ ము ఏ.నవదీప్ తేజ, సాత్ విక్, వి.చైతన్య, దాసరి అంకయ్య, చింతా వాసు తదితరులు పాల్గొన్నారు.

రైతులను వేధిస్తున్న నీటి సమస్య

సాగు ప్రశ్నార్ధకంగా మారింది. ఏడు సంవత్సరాలుగా సాగునీటి కోసం రెగ్యులేటర్ కిందసాగు చేసే రైతులు ఈరోజులలో పోరాటం చేయడం అధికారులు నీరు వదలడం పరిపాటిగా మారింది ఈ రెగ్యులేటర్ కు భీమ నది ఛానల్ నుంచి కొండవరం దగ్గర విడుదల అయ్యే విడుదలయ్యే తూము గతంలో మూడు అడుగులు ఉండగా దానిని ఏడు సంవత్సరాల క్రితంఅడుగు తూము వేయడంతో నీరు సమస్య ఎప్పటికప్పుడు తలెత్తుతోంది. ఏటా ఈ సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కౌలు రైతులు వడ్డే వెంకటేశ్వరరావు, సిద్దెల వెంకటేశ్వరరావు తదితరులు కోరారు. ఎండిపోయిన నారు నడులను దమ్ము చేయించిఅవసరమైన నారు బయటినుంచి కొనుక్కొచ్చి నాట్లు వేయిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కౌలుకు చేస్తున్న 12 ఎకరాలలో 7 ఎకరాలలో నాటు వేసిన వరి పైరుకు నీరు అందంక ఎండిపోయిందని ఇప్పటివరకు రెండు లక్షల రూపాయలు ఖర్చు అయిందని కౌలు రైతు వడ్డే వెంకటేశ్వరరావు తెలిపారు.

కొనసాగుతున్న వరద ఉధృతి

ఏర్పాడ్డాయి. గ్రామం నుండి మండల కేంద్రం అయిన అవనిగడ్డకు ఏ పని మీద అయిన గ్రామస్థులు రావాలంటే పడవ ప్రయాణం తప్పనిసరి అయ్యింది. ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన పడవలోనే గ్రామస్తులు, విద్యార్థులు పలు పనులపై వచ్చే వారు బిక్కు బిక్కుమంటూ పడవ ప్రయాణం చేయవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. గడిచిన 10 సంవత్సరాలుగా ప్రభుత్వాలు, పాలకులు మారినా, ఆ గ్రామస్తుల పడవ ప్రయాణం మాత్రం తప్పడం లేదు. కాజ్వే వంతెన నిర్మాణం చేపడతామని ప్రభుత్వాలు మారిన సమయంలో ప్రజాప్రతినిధుల మాటలు నీటి మీద రాతలుగానే మిగిలిపోయాయి. శనివారం ఆక్విడేట్‌కు 6 అంగులాల వ్యవధిలో నీటి ప్రవాహం కొనసాగుతుంది.

ఘనంగా వీవీ గిరి జయంతి

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్ర కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి వరాహగిరి వెంకటగిరి జయంతి కార్యక్రమం శనివారం ఆంధ్రరత్న భవన్ నందు ఘనంగా జరిగింది. వీవీ.గిరి భారత రాష్ట్రపతిగా, ఉప రాష్ట్రపతిగా, వివిధ రాష్ట్రాల గవర్నర్ గా అనేక పదవులు అలంకరించి ఆ పదవులకు వన్నెతెచ్చిన మహనీయుడని కొనియాడారు. దేశానికి ఆయన చేసిన సేవలకు గాను భారత రత్న అవార్డుతో వీరిని గౌరవించుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడా సురేష్, అన్సారీ, నరహరశెట్టి నరసింహ రావు, లక్కరాజు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణ పాదయాత్ర

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: తిరువూరు నియోజకవర్గంలోని ప్రజలకు ఫ్లోరైడ్, సిలికాన్ రహిత తాగునీటిని అందించి, ప్రజారోగ్యాన్ని కాపాడాలనే డిమాండ్‌తో సీపీఐ పార్టీ తలపెట్టిన పాదయాత్రను జయప్రదం చేయాలని పార్టీ జిల్లాకమిటీ సభ్యుడు షేక్ నాగుల్‌మీరా పిలుపునిచ్చారు. విస్సన్నపేటలో ప్రజాసంఘాల నేతలతో కలసి ఆయన పాదయాత్రకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై అగ్రభాగాన నిలిచి, వారికి న్యాయం జరిగే వరకు పోరాడే చరిత్ర ఉన్న పార్టీ సిపిఐ అని స్పష్టం చేశారు. కిడ్నీ వ్యాధుల నుంచి ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల ప్రజలను కాపాడాలనే డిమాండ్‌తో ఈనెల 27వ తేదీన ఎ.కొండూరు నుంచి సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. జగ్గయ్యపేటలోని సిమెంట్ కర్మాగార బాధితులు, క్వారీ కార్మికుల సమస్యలతో సహా, విశాఖ పాలీమర్స్ ప్రమాదం తదితర ఘటనల సందర్భంలో సిపిఐ ప్రజల పక్షాన పోరాడిందన్నారు. తాజాగా మరో ఉద్దానంగా మారనున్న తిరువూరు నియోజకవర్గాన్ని కాపాడుకునే దిశగా పోరాటపంథా సాగుతుందని, ప్రజలంతా తమ మద్దతుతో పోరాటాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయనతోపాటు వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు, రైతుసంఘం నాయకుడు వేగి వెంకటేశ్వరరావు, సిపిఐ మండల కార్యదర్శి ఎం.త్యాగరాజు, ఏఐటీయూసీ నాయకుడు గంజాల నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్య పరిరక్షణ పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ: ఎన్టీఆర్ జిల్లాలో కిడ్నీ బాధితులకు కృష్ణానది జలాలను సరఫరా చేయాలని, పరిశ్రమల కాలుష్యాన్ని నివారించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎన్టీఆర్ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 27, 28, 29 తేదిలలో నిర్వహించన్ను 'ప్రజా ఆరోగ్య పరిరక్షణ పాదయాత్ర' పోస్టర్ సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ మేరకు ఏ.కొండురూ మండలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పాదయాత్ర జయప్రదం చేయాలని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కే.నాగుల్ మీరా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు, ఎ.కొండూరు మండల కార్యదర్శి మేకల డేవిడ్, స్థానిక నాయకులు పంబి మోహనరావు, ముచ్చింతల వెంకటేశ్వరరావు, మేకల మోషే, కే.సురేష్, బి.ఉపేంద్ర, ఎంమహేష్, ఎం.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ మూడో విడత కౌన్సిలింగ్‌నకు చర్యలు తీసుకోండి

రెండు విడతలుగా కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. రెండో విడత జరిపిన కౌన్సిలింగ్‌ను తుది విడత కౌన్సిలింగ్‌గా రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఇంజనీరింగ్ కళాశాలలలో 18,951 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఖాళీగా ఉన్న ఆయా ఇంజనీరింగ్ సీట్లను తృతీయ కౌన్సిలింగ్ నిర్వహించి భర్తీ చేసి, ఇంజనీరింగ్ విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. ఏపీ ఈఏసీపీఈటీ కౌన్సిలింగ్ ద్వారా సీట్లు పొందుతారో వారికి మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రీఎంబర్స్మెంటు వర్తిస్తున్న నేపథ్యందో ఇంజనీరింగ్ చదవాలనుకున్న పేద విద్యార్థులకు ఉపయుక్తం అన్నారు. ఆర్థిక పరిస్థితి వలన మేనేజ్మెంట్ కోటా బి-కేటగిరీ సీట్లలో ప్రవేశాలు పొందలేక పోతున్నారని పేర్కొన్నారు. తృతీయ కౌన్సిలింగ్ ఇంజనీరింగ్ సీట్లు భర్తీ చేయాలని కోరారు.

పరిశోధనతో ఉన్నత ప్రమాణాలు

విశాలాంధ్ర-విజయవాడ: ఉన్నత విద్యా సంస్థల్లో పరిశోధన ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు కలిసి ఉన్నత ప్రమాణాలను నెలకొల్పటానికి అవకాశం ఉంటుందని గగన్‌యాన్ ప్రోగ్రామ్ చీఫ్ కో.ఆర్డినేటర్, విశ్రాంత సైంటిస్ డాక్టర్ మనియోజ్ అన్నారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఆంధ్ర లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్, అండ్ టెక్నాలజీలో‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధన ప్రక్రియలు, పద్ధతులు బెంజ్ మార్కింగ్ అనేది అత్యంత అవసమైనదిగా పరిగణించటం జరుగుతుందన్నారు. పరిశోధన నాణ్యతను పెంచి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందవచ్చన్నారు. పరిశోధనలో ఆయన అనుభవాలను సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజ్‌మెంట్ డాక్టర్ బి.జోజిరెడ్డి, డైరెక్టర్ పీఆర్.జాన్‌లతో పాటు డి.బాలస్వామి, ఒ.మహేష్, డాక్టర్ క్యాండీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-ఘంటసాల : శిక్షణ తరగతుల్లో పాల్గొన్న సర్పంచు, కార్యదర్శులు గ్రామ పంచాయతీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఘంటసాల ఎంపిడివో బి.మారుతీ శేషమాంబ అన్నారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 22 గ్రామ పంచాయతీల సర్పంచ్లు, కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపిడివో మారుతి శేషమాంబ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అధికారాలు, బాధ్యతలు, జీపీడీపీ నిధులు, సాధరణ పరిపాలన గురించి, పారిశుధ్యం, తాగునీరు, ఎస్ఈడీ లైట్లు, చెత్తనుండి సంపద కేంద్రాలు, వర్మీకంపోస్టు నిర్వహణ, ప్లాస్టిక్ వాడకం, గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తదితర అంశాల పై శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న కార్యక్రమాలను గ్రామ స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు.

క్రీడాకారులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

నియోజకవర్గస్థాయి క్రీడా, సాంస్కృతిక వేడుకలు శనివారం పట్టణంలోని సాదినేని చౌదరయ్య పబ్లిక్ స్కూలో కొనసాగాయి. రెండోరోజు బాలబాలికల విభాగంలో లాంగ్ జంప్, రన్నింగ్, షాట్‌పుట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం లభించడంతో పాటు విద్య, ఉపాధిలో క్రీడా కోటా ద్వారా మెరుగైన అవకాశాలు ఉంటాయని తెలిపారు. క్రీడాకారులు నిరంతరం సాధన చేసి ఉన్నత శిఖరాలను చేరుకోలన్నారు. నియోజకవర్గంలో నలుమూలల నుంచి వివిధ పాఠశాలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. పోటీలను వ్యాయమ ఉపాధ్యాయుల సంఘం షేక్ ఖాదర్ మస్తాన్, పీఈటీలు ఏఎంజీ రాజు, డీవీ రాజు, నాగరాజు, మనోహర్, ఆనంద్, షలోమి, అస్మిత్‌లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, ఏఐఎస్ఎఫ్ ఇన్‌చార్జి బి.భగత్‌సింగ్, సీపీఐ పట్టణ కార్యదర్శి పేలూరి రామారావు, నాయ కులు నాయుడు శివ, ఆరాధ్యుల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ ఏరియా అధ్యక్షుడు మేకపోతుల నాగేశ్వరరావు, కార్యదర్శి తలాని డాపి, నాయకులు ఎం.సాయి నాయక్, మధు, లోకేష్‌నాయక్, పి.గోపి, సాహిత్, జాన్‌వెస్లీ, మంజుల, గౌతమి, చౌదరయ్య పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ బాష తదితరులు పాల్గొన్నారు.

మంచి సినిమాలను ప్రోత్సహించాలి

శనివారం ఆయన విచ్చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశవిదే శాల మంచి సినిమాలను ఎంపిక చేసుకుని దేశ వ్యాప్తంగా ఫిలిం ఫెస్టివల్స్‌లో వాటిని ప్రదర్శించడం, ప్రముఖ సినిమా ప్రముఖులను రప్పించి వారితో సాధారణ ప్రేక్షకులు-బాలలు చర్చలు జరిపేందుకు, వివరాలను తెలుసుకునేందుకు, సందేహాలను నివృత్తి చేసుకునేందుకు, అభిప్రాయాలు తెలియజేసేందుకు ఓపెన్ ఫోరం పేరుతో సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేయడం జరుగుతుంద న్నారు. ఫిల్మ్ అప్రిసియేషన్ కోర్సులను రెండు మూడు రోజుల పాటు నిర్వహించడం, షార్ట్ ఫిల్మ్-డాక్యుమెంటరీ ఫిల్మ్ తీసే విధానం, పెద్ద పెద్ద నగరాలే కాకుండా చిన్న పట్టణాలలో కూడా ఫిల్మ్ క్లబ్‌లు ఏర్పాటును ప్రోత్సహించి ఆరోగ్యకరమైన సినిమాను, సమాజానికి మంచి సందేశాన్ని అందించే సినిమాలను నిర్మాతలు అందించేలా కార్యాచరణ రూపొందించు కోవడం వంటి అంశాలను ఆధారంగా చేసుకుని ఫిల్మ్ సొసైటీస్ ఆఫ్ ఇండియా పనిచేస్తుందని వెల్లడించారు. ఈ నెల 31, సెప్టెంబర్ 1న పూణేలో జాతీయ స్థాయి ఫిల్మ్ సొసైటీస్ సమావేశం జరుగనున్న సందర్భంగా స్థానికంగా పనిచేస్తున్న ఫిల్మ్ సొసైటీలను కలిసి కొత్త ప్రణాళికలు రూపొందించే కార్యక్రమంలో భాగంగా తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటీ సభ్యులను, సెక్రటరీ బొల్లిముంత కృష్ణను కలవడం జరిగిందని చెప్పారు. ఈ నెల నుంచి తెనాలిలో ప్రతి మాసం రెండు దేశ, విదేశీ చిత్రాలను ప్రదర్శించాలని, అలాగే నవంబర్ మాసంలో మూడు రోజుల పాటు అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలను జరుపుకోవాలని, ప్రత్యేకించి విద్యార్థులకు సినిమాపై అవగాహన కల్పించేందుకు షార్ట్ ఫిల్మ్ తీసే మెళుకువలను నేర్పేందుకు వర్క్ షాప్ నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. దానికి కావాల్సిన సినిమాలు, ప్రణాళిక ఎఫ్ఎఫ్ఎస్ఐ సదరన్ రీజియన్ తోడ్పాటు అందించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు.

అంతర్జాతీయ క్రీడల్లో రాణించాలి

గురునానక్ కాలనీ, పటమటలో పర్యటించిన వీఎంసీ కమిషనర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర నగర పర్యటనలో భాగంగా శనివారం సర్కిల్-3 పరిధిలోని గురునానక్ కాలనీలోని ఫన్‌టైమ్స్ క్లబ్, పట మటలోని ఖన్నానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఫన్ టైమ్స్ క్లబ్ ప్రాంతంలో వివిధ ఆటలు ఆడుతున్న చిన్నారులతో ముచ్చటించారు. వారు ఆడుతున్న ఆటలను పరిశీలించి అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కష్టపడాలని సూచించారు. పారిశుధ్య నిర్వాహణలో అధికా రులు, పారిశుధ్య సిబ్బంది అంకిత భావంతో సక్రమంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఖాళీ ప్రదేశాల యజమానులు తమ తమ స్థలాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకునేలా చూస్తూ ప్రజలకు ఎలాంటి సౌకర్యం కలగకుండా వర్షపు నీటి నిలువల్లో దోమలు వృద్ధి చెందకుండా చూడాలని సూచించారు. ఈ పర్యటనలో నగర పాలక సంస్థ సర్కిల్-3 జోనల్ కమిషనర్ శివరామకృష్ణ, డిప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ చీరన్‌రాయ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రూ.66.84 లక్షల పాలబోనస్

విశాలాంధ్ర-కూచిపూడి : 2024-25 ఆర్థిక సంవత్సరంలో తొలివిడతగా కృష్ణామిల్క్ యూనియన్ ఈఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి జులై నెలాఖరు వరకు తొలి విడతగా నాలుగు నెలల కాలానికి పాడి రైతులను ప్రోత్సహించడానికి పాలరైతులకు ప్రోత్సాహక బోనస్ కేటాయించినట్లు మొవ్వ హెడ్క్వార్టర్స్ సూపర్వైజర్ కైలా రమేష్ శనివారం తెలిపారు. పామర్రు పాలశీతల కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణ గోపీనాథ్ పర్యవేక్షణలో 134 పాల సంఘాలు, 20 డైరీ ఫార్మర్స్. తోపాటురా మిల్క్ సప్లయర్స్ కు కలిపి.రూ.66,84,488లను బోనస్ గా కేటాయించారని వివరించారు. భారతదేశంలోనే అత్యధిక పాల ధరను, పాల బోనస్ ఇస్తూనే రైతులకు మరెన్నో సంక్షేమ కార్యక్రమాలు కల్పిస్తూ పాడిపశువులు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ మొబైల్ వైద్యశాలద్వారా పశు వైద్య సౌకర్యం, మేలు జాతి సెమన్ అందించే అత్యధిక పాల ఉత్పత్తి అందించే పశువులను అభివృద్ధి చేయటంలో కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు దృష్టి సారించి ఎల్లవేళలా ముందుంటున్నారన్నారు.

కోర్టు భవనం ప్రారంభం

విశాలాంధ్ర-నందిగామ: నందిగామ 16వ అదనపు జిల్లా జడ్జి కోర్టు, రామన్నపేట రోడ్డు నందుగల కోర్ట్ అద్దె భవనం నుండి గాంధీ సెంటర్‌లో నంది గామ కోర్టు భవనాలను పాత ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులోకి మార్చారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు సంద్రు బాబు విద్యాసాగర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా 16వ అదనపు ఇంచార్జి జిల్లా జడ్జి శేషయ్య, సీనియర్ సివిల్ జడ్జ్ లక్ష్మీ రాజ్యం, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ రియాజ్, అడిషనల్ జ్యుడీషి యల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ రేష్మా, బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎక్కిరాల హనుమంత రావు, ఉపాధ్య క్షులు కురగంటి కృష్ణంరాజు, లైబ్రరీ ఆనందం విజయ్, పీపీ రంగారావు, ఏపీపీ దర్శి అర్జున, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

సంపద తయారీపై ప్రత్యేక దృష్టిసారించాలి

విశాలాంధ్ర-చల్లపల్లి : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తడి పొడి చెత్త వేర్వేరుగా సేకరించటం, వర్మికంపోస్ట్ తయారీ చేయటం ద్వారా సంపద తయారుచేయటంపై సర్పంచ్లు, కార్యదర్శులు ప్రత్యేక దృష్టిసారించాలని చల్లపల్లి, మోపిదేవి ఇన్చార్జి ఎంపీడీవోలు బూరేపల్లి అశోక్‌కుమార్, రామలింగేశ్వరరావులు సూచించారు. సర్పంచ్లు, కార్యదర్శులకు మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణా కార్యక్రమాల ముగింపు రోజైన శనివారం చల్లపల్లి సంపద తయారీ కేంద్రం వద్ద చల్లపల్లి, మోపిదేవి మండలాల సర్పంచ్లు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, వర్మి కంపోస్ట్ తయారీ విధానాల గురించి తెలిపారు. చల్లపల్లిలో సంపద తయారీకేంద్రంలో వర్మికంపోస్ట్ తయారీ విజయవంతంగా జరుగుతోందని, సంపద కేంద్రం నిర్వహణలో చల్లపల్లిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. తడి, పొడి చెత్తలు వేర్వేరుగా సేకరించటం, నాడెపు పిట్లలో తడిచెత్తను 45 నుంచీ 60 రోజులు నిల్వ చేయటం, ఆ తర్వాత వర్మిపిట్లలో వేయటం, పేడ..పీచు..ఎర్రలు వేసి గోనెసంచులు కప్పి వర్మి తయారుచేసే విధానాలను వివరణాత్మకంగా తెలియచేశారు. వర్మికంపోస్టు కిలో రూ.10 చొప్పున విక్రయించి పంచాయతీకి అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని సూచించారు. ఇన్చార్జి ఎంపీడీవో బూరేపల్లి అశోక్, చల్లపల్లి కార్యదర్శి పి.వి.మాధవేంద్ర రావులు ట్రైనింగ్ అధికారులుగా వ్యవహరించారు. చల్లపల్లి, లక్ష్మీపురం సర్పంచ్లు పైడిపాముల కృష్ణకుమారి, కొల్లూరు కోటేశ్వరరావు సర్పంచ్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కంచికచర్లలో వైసీపీకి షాక్!

విశాలాంధ్ర-కంచికచర్ల : కంచికచర్ల పట్టణంలో వైసీపీ దాదాపు ఖాళీ అయినట్లే ఆ పార్టీలో చెప్పుకోదగ్గ నాయకులు లేరు అని చెప్పవచ్చు. కంచికచెర్ల పట్టణంలో స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఉదయం జరిగిన వైసీపీకి చెందిన సర్పంచ్, వార్డు సభ్యులు కూడా టీడీపి మండల పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు అధ్యక్షతన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆదేశానుసారం జిల్లా పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురాం ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు నాయకులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన సర్పంచ్ వేల్పుల సునీత ఆమె భర్త వేల్పుల శ్రీనివాసరావు, 2వ వార్డు పంచాయతీ మెంబర్ గొర్రెపాటి సతీష్, 3వ వార్డుకి చెందిన శేషం సుధా, శేషం మధు, 10వ వార్డు మెంబర్ షేక్ ఖరిమా, బుడే, 14వ వార్డు మెంబర్ కావాటి ఉషారాణి రాంబాబు, 15వ వార్డు నెంబర్ ఓర్సు నరసింహారావు, 16వ వార్డు మెంబర్ చెన్నం శెట్టి కుమారి ప్రసాద్లు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరితోపాటు పట్టణం లోని ప్రముఖ సీనియర్ వైసిపి నాయకులైన లగడపాటి నాగేశ్వరరావు, పుల్లగూరబాబు, వైసిపి పట్టణ మాజీ అధ్యక్షులు దాసరి రాము, బీసీసెల్ నాయకులు జొరిగ కిషోర్, 7వ వార్డు వైసిపి పార్టీ ఇంచార్జ్ గ్రంథి వెంకటేశ్వరరావు, కావాటి రాంబాబు, వీర్నాల వెంకటేశ్వరరావు, కట్ట తిరపతిరావు, బాణావత్ సురేష్, బర్రె విష్ణు, చలవాది లక్ష్మణరావు, ఆవుల రాంబాబు, మంగిశెట్టి ప్రతాప్, మాగంటి నరేంద్రబాబు, చల్ల చిట్టిబాబు, పందిర్ల శివాజీ, మేరగ బుజ్జి తదితరులు టిడిపి తీర్థంపుచ్చుకున్నారు. జిల్లా టిడిపి పార్టీ అధ్యక్షులు వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురాం మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి ఫలాలతో పాటు రాష్ట్ర ప్రజానీకం కోసం అనేక సంక్షేమ కార్యక్ర మాలు నిర్వహిస్తున్నారని దానికి ఆకర్షితులై వైసిపి నాయకు లు చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ నన్నపనేని లక్ష్మీనారా యణ,గుత్తా రత్నం,దమ్మాల పాటి రాజా, తాడపనేని లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం దాడిపై ఆగ్రహం

విశాలాంధ్ర-కూచిపూడి : విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సామాజిక మహాశిల్పాన్ని కూల్చేందుకు ప్రయత్నించటం పట్ల పామర్రు నియోజకవర్గంలోని మొవ్వ అంబేద్కర్ యువజన సంఘం తీవ్రంగా ఆగ్రహించింది. ఈ సంఘటన రాజ్యాంగానికి మాయని మచ్చ అంటూ శనివారం మధ్యాహ్నం అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు గ్రామ పురవీధులలో ఊరేగి మొవ్వప్రధాన సెంటర్లో రహదారిపై రాస్తారోకో నిర్వహించి అంబేద్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆ సామాజికమహాశిల్పాన్ని ధ్వంసం చేసిన ప్రభుత్వంపై, దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ మహా శిల్పం పై జరిగిన దాడికి ప్రభుత్వం స్పందించి దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఎంపీటీసీగాదిగానిబాపూజీ, అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు దాసరి శ్రీనివాసరావు, డీకొల్లురాజశేఖర్, బండి సహదేవుడు, వరి గంజి నాగేంద్రరావు, తుళ్లూరివేణు, గోవాడ అనిల్, వరి గంజి గౌతమ్, కూతాడిశాయి, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా మండలంలోని పలు గ్రామాల నుంచి దళిత సంఘాలు అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

యానాదుల జీవితాల్లో వెలుగులు

విశాలాంధ్ర-బంటుమిల్లి :- రాష్ట్రంలో యానాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకమైన చర్యలను చేపడుతారని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఆదివాసీ దివస్ కార్యక్రమం సంద ర్భంగా శనివారం మునుజులూరులోని యానాది కాలనీలో మచిలీపట్టణం రోటరీ క్లబ్ వారు యానాదుల సమస్యలపై అవగాహన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ యానాదుల కుటుంబాలకు ఆధార్ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వము అందజేసే పథకాలకు ఆమడ దూరంలో ఉండిపోతుండటం బాధకరమని అన్నారు. ఎవరు అధైర్యపడొద్దని ,ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డులు అందించే దిశగా అధికార యంత్రాంగం పనిచేయడం మొదలు పెట్టిందని కాగిత వివరించారు. .అందరికి పక్కా గృహాలు ,చిన్నారులకు విద్యతో పాటు సకల సౌకర్యాలను కల్పించడం జరుగుతుందన్నారు. యానాదుల కాలనీలలో ప్రశాంతమైన ఆధునిక వాతావరణాన్ని కల్పిస్తామని హామీ నిచ్చారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ శాంతి అధ్వర్యంలో నిర్వహించగా మునుజులూరు సర్పంచి కూనపురెడ్డి సునీత టీడిపి మండల పార్టీ అధ్యక్షులు కూనపురెడ్డి వీరబాబు, బొర్ర కాశీ, రోటరీ నుంచి అనుపమ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

ఒకరి మృతి, నలుగురుకి గాయాలు

విశాలాంధ్ర-కంచిక చర్ల: కంచికచర్ల పెద్ద కాలవ సమీపంలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమా దంలో ఒక మహిళ మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి. కంచికచర్ల పోలీసుల వివరాలు ప్రకారం హైదరాబాదు నుంచి ఏలూరు వెళ్తున్న కారు మధ్యాహ్నం రెండున్నర గంటల సమయంలో కీసర దాటి పెద్ద కాలవ సమీపంలో డివైడర్ని ఢీకొని ప్రక్కన పొలంలోకి పల్టీ కొట్టింది. అటుగా వెళుతున్న వాహనదారులు గాయ పడిన వారిని కారులో నుండి బయటకు తీశారు. కారులో ప్రయా ణిస్తున్న ఉషారాణి మృతి చెందగా, రాధాదేవి విజయ్‌కుమార్, సంపత్ కుమార్, రఘురాం లకు గాయాలయ్యాయి. సమాచారం అందు కున్న హైవే మొబైల్ టీం గాయపడిన వారిని హుటాహుటిన చికిత్స నిమిత్తం 108లో విజయవాడ ఆసుపత్రికి తరలించారు. పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తప్పిన అగ్ని ప్రమాదం

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక జగన్నదపురంలో దేవస్థానం వెళ్ళే దారిలో పకన ఉన్న తాటకులకు నిప్పు అంటుకోవ డంతో స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది తక్షణమే స్పందించి, మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది.

ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-ఉంగుటూరు : మండలం లోని పెద్ద అవుటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శనివారం జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ గీతాబాయి ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రజలను వైద్య ఆరోగ్యశాఖ పనివిధానంపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించా లని సిబ్బందికి చెప్పారు. సిబ్బంది పనితీరుకి జిల్లా వైద్య ఆరోగ్య, శాఖ అధికారిని డాక్టర్ గీతాబాయి సంతృప్తి వ్యక్తం చేశారు.

పాండురంగాపురం -భద్రాచలం-మల్కన్‌గిరి రైల్వేలైన్ : డీఆర్ఎం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : కేంద్ర ప్రభుత్వం పాండురంగాపురం - భద్రాచలం - మల్కన్‌గిరి కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టు వలన రెండు తెలుగురాష్ట్రాలు అయిన ఆంధ్ర-తెలంగాణకు ఎంతో మేలు జరుగుతుందని విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్(డిఆర్ఎం) నరేంద్ర ఎ పాటిల్ తెలిపారు. శనివారం ప్రధాని అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ రైల్వే శాఖ పరిధిలోని 8 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది.ఈ సందర్భంగా రైల్వే మంత్రి వాటి వివరాలను ఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు.ఈ సందర్భంగా డివిజనల్ కార్యాలయంలో డిఆర్ఎం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాండురంగాపురం - భద్రాచలం - మల్కన్‌గిరి కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టును గిరిజన ప్రాంతాల ద్వారా నూతన రైలు మార్గాన్ని అందిస్తూ ఇది అసన్సోల్-వరంగల్ మధ్య ప్రత్యామ్నాయ రైలు మార్గంగా ఉంటుందన్నారు. ఇప్పటికే ఉన్న విజయవాడ- విశాఖపట్నం- భువనేశ్వర్- కోల్‌కతా కోస్తాతీరప్రాంతానికి నూతనంగా నిర్మిస్తున్న వరంగల్-భద్రాచలం-మల్కన్‌గిరి- జయ్‌పూర్ - టిట్లాగఢ్‌కు అదనపు రైలు మార్గం అన్నారు.కొత్త మార్గం పాండురంగాపురం - మల్కన్‌గిరి - భద్రాచలం మీదుగా జునాఘర్ 85.5 కిలోమీటర్ల దూరం ఏపిలోని తూర్పుగోదావరి జిల్లాలో ప్రయాణిస్తుందన్నారు.ఒడిశా రాజధాని ఇంటెన్సివ్ ఇండస్ట్రీ క్లస్టర్లను కలుపుతుంద న్నారు. సరుకు రవాణాను సులభతరం చేయటంతో పాటు ఏదైనా ప్రకృతి వైపరీత్యాలు/విపత్తులు సంభవించి నప్పుడు ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగపడుంద న్నారు. ప్రస్తుత విజయవాడ - హౌరా సెక్షనల్ కెపాసిటీ 130 శాతంకు చేరుకుంది,ఈ కొత్త లైన్ వలన కొత్త రైళ్ల నడపటానికి అవకాశం కలుగుతుందన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : బ్యాంకు అందించే ప్రోత్సాహం విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని అంది పుచ్చు కుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని డైరెక్టర్లు పొట్లూరి వెంకట రమణ రావు, చిన్నం కోటేశ్వరరావు లు అన్నారు. శనివారం స్థానిక చమనగిరిపేటలోని ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు ఆవరణలో విద్య ప్రతిభ ప్రధానోత్సవం కార్యక్రమం పొట్లూరి వెంకట రమణారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంక్ దక్షిణ భారతదేశంలోని అతి పెద్ద బ్యాంకు గా అవతరించిందని, ముఖ్యంగా ఈ బ్యాంకు లోని సభ్యులకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తుందని అందులో భాగంగా బ్యాంక్ సభ్యుల కుటుంబంలో ఎవరైనా చదువుల్లో అత్యుత్తమ మార్కులు అందుకున్న విద్యార్థిని విద్యార్థులకు ప్రోత్సాహకరమైన బహుమతులు అందజేస్తారని, టెన్త్ క్లాస్ 90 శాతం, ఇంటర్లో 90%, అలాగే ఎంసెట్, ఐసెట్, నీట్‌జెట్ కాంపిటీషన్ ఎగ్జామ్స్‌లో ర్యాంక్ సాధించిన విద్యార్థులకు అందజేయడం జరుగుతుందని వారు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల్లో 51 శాఖలుగా ఈ బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతుందని వారు అన్నారు. ముఖ్యంగా మచిలీపట్నంలో ఈ బ్రాంచ్ అన్ని విధాలుగా ఖాతాదారులకు అందుబాటులో ఉంటుందని వారు వెల్లడించారు. 1292 మంది సభ్యులతో 15 కోట్ల85 లక్షలతో డిపాజిట్ రూపంలో ఉందని 34 కోట్ల 90 లక్షల రుణాలు అందజేశారని వారు అన్నారు. షేక్ ఆరిఫా, నందికోట భువన శృతి, బోడపాటి విజయ శృతి, మోదుమూడి ఉదయ్ బ్యాంకు ప్రోత్సాహ బహుమతి పొందిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సంప్రదింపుల కమిటీ సభ్యులు మోదుమూడి రామారావు, దేవభక్తుని నిర్మల, పెసల వెంకట నిర్మలాదేవి, బ్యాంక్ మేనేజర్ కె ఎస్ అజయ్ కుమార్, ఏ పూర్ణచంద్రరావు, పి వెంకటేశ్వరరావు, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేవభక్తుని నిర్మల లండన్ యాత్ర విజయవంతం కావాలి

దేవభక్తుల నిర్మల లండన్ బయలుదేరుతున్న సందర్భంగా ఆవిడయాత్ర విజయవంతం కావాలని కోరుతూ విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ సంప్ర దింపుల కమిటీ ఆధ్వర్యంలో శనివారం వీడ్కోలు పలికారు. పెసల వెంకట నిర్మలాదేవి అధ్యక్షతన నిర్వహించి నిర్మలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ కెఎస్ అజయ్‌కుమార్, పి. వెంకటేశ్వర రావు, డి ఎస్ఎన్ శాస్త్రి, ఏ.పూర్ణచంద్రరావు, మోదుమూడి రామారావు బ్యాంక్ సిబ్బంది పాల్గొని నిర్మల పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఆమె తనకు జరిగిన సత్కారానికి కృతజ్ఞతలు తెలిపారు.

డయేరియాకు కళ్లెం

విశాలాంధ్ర-అవనిగడ్డ : డయేరియా వ్యాధి సోకకుండా పంచాయితీ పరిధిలో శానిటేషన్ పనులు శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ఆదేశాల మేరకు గత 5 రోజులుగా ఇన్‌చార్జ్ ఈఓపిఆర్‌డి కమ్మిలి సుందరి ఆధ్వర్యంలో పంచాయితీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. శానిటేషన్ పనులలో భాగంగా శనివారం 5,6,7 వ వార్డులలో సున్నం, బ్లీచింగ్ చల్లి, దోమల నివారణకు ఎబ్బెట్ మందును పిచికారి చేశారు.

బాలికల వసతి గృహానికి నిత్యావసరాలు

విశాలాంధ్ర-మచిలీపట్నం : మైత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక భాస్కర పురంలోని ఎవిలిన్ గర్ల్స్ హెూం కు సుమారు 10 వేల రూపాయల విలువ గల బియ్యం నిత్యావసర సరుకుల వితరణ శనివారం అందజేశారు. గత వారంలో గుడ్లవల్లేరు వాస్తవ్యులు వల్లూరు వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో భాగంగా హాస్టల్ కు విచ్చేసిన వల్లూరు సాయి శ్రీను వారి మిత్ర బృందం బాలికల అవసరాలు తెలుసుకుని వెంటనే స్పందించి తోటి మిత్రుల సహకారంతో సేకరించిన నిత్యావసర సరుకులు హాస్టల్ బాలికలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మైత్రీ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు వరప్రసాద్, దాతలు వల్లూరు సాయి శ్రీను వారి మిత్రులు, సభ్యులు కనకరాజు, బి బి ఎస్ ప్రసాద్,రామకృష్ణ, రిలాక్స్ ప్రసాద్, రమాదేవి పాల్గొన్నారు.

సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎ.పి.యన్.జి.ఓస్ అసోసియేషన్ అండగా ఉంటుందని పశ్చిమ కృష్ణా జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ హామీ ఇచ్చారు. శనివారం గాంధీనగర్‌లోని ఎ.పి.యన్.జి.జి.ఓస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో గ్రామ వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల రాష్ట్ర కార్య వర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విద్యాసాగర్ మాట్లాడుతూ దివ్యాంగ ఉద్యోగులకు కన్వేయన్స్ అలవెన్సు పెంపుదలకు సంభందించి ఎ.పి. యన్.జి.జి.ఓస్ అసోసియేషన్ తరపున పూర్తి స్థాయిలో కృషి చేస్తామన్నారు. దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమం కోసం ఉద్యోగులు కోరిన విధంగా సంక్షేమ నిధి గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తామని, అలాగే సంఘం యొక్క ఆవశ్యకత గురించి వివరించారు. మరో అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.జాని పాషా మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల హక్కులను 2016 చట్ట ప్రకారం పరిరక్షణ కల్పించడం కోసం కృషి చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో దివ్యాంగ ఉద్యోగులరాష్ట్ర అధ్యక్షులుపి.అశ్వర్థ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.కాశీ విశ్వనాధ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.రామాంజనేయులు, అదనపు కార్యదర్శి ప్రేమ్ సుధాకర్ గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రోజా ప్రకాష్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యస్.కె.సుభాని, తదితరులు పాల్గొన్నారు.

వయోజన విద్యను నిర్వీర్యం చేశారు : విజయకుమార్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీన గర్) : వయోజన విద్యను గత వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని దాంతో అందులో విధులు నిర్వహించే వారి సమస్యలు తీవ్రస్థాయిలో ఉన్నాయని కూటమి ప్రభుత్వం వాటిని రిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వయోజన విద్య ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి ఆర్.విజయకుమార్ విజ్ఞప్తి చేశారు.శనివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సంఘం సభ్యులు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో మానవ అభివృద్ధి సూచిలో కీలక పాత్ర పోషించే అక్షరాస్యతలో మన రాష్ట్రం అట్టడుగు స్థానంలో ఉందని అక్షరాస్యతను అభివృద్ధి చేయడానికి గత ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టకపోగా సీఎం సలహాదారుల సిఫారసుల మేరకు కేవలం వారి సామాజిక వర్గానికే చెందిన అనర్హులను వయోజన విద్యాశాఖలో నిబంధనలకు నియమించిందన్నారు. వారి సామాజిక వర్గానికే చెందిన ఒక ఉద్యోగి ఎం.ఎల్.ఏ గా పోటీ చేయడానికి తన ఉద్యోగానికి రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. రాష్ట్రంలో ఉన్న డిఆర్డిఏ మెప్మా డ్వామా ఉపాధి హామీ పథకాల శాఖలను వయోజన విద్య శాఖతో సమన్వయపరచి ఆర్థిక శాఖపై ఎటువంటి భారం పడకుండా అక్షరాస్య కార్యక్రమాలను రూపకల్పన చేయాలని తద్వారా గ్రామాలలో విద్యకు దూరంగా ఉన్న వయోజనులు త్వరగా అక్షరాసులుగా మారే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవివి సత్యనారాయణ సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ముగిసిన సర్పంచుల శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని 18 గ్రామ పంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులకు మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ఎంపీడీవో టి సీతామహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన శిక్షణా తరగతులకు ముఖ్యఅతిథిగా ఎంపీపీ గోగం సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీ విధులు బాధ్యతలు, చెత్త నుండి సంపద కేంద్రాల వినియోగం, పారిశుద్ధ్య నిర్మూలన పై అవగాహన, తదితర అంశాలపై సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి వంగ శ్రీనివాస్, అన్ని గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ చలానాలను చెల్లించండి : సీ.ఐ రమణ

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్ : ట్రాఫిక్ ఆంక్షలు పాటించకుండా వాహనాలను నడిపే వారికి ట్రాఫిక్ పోలీసులు చలానాలను విధించడం పరిపాటి. అయితే చలానాలు చెల్లించకుండా బకాయి ఉన్న వాహనదారులకు ట్రాఫిక్ సి.ఐ రమణ శనివారం నగరంలో తగు సూచనలను చేశారు. వాహనాలపై ఉన్న బకాయిలు చెల్లించకుండా వేరే వారికి వాహనాలను అమ్మి వారిని ఇబ్బందులకు గురి చేయడం సరికాదని ట్రాఫిక్ సి.ఐ రమణ వివరించారు. ట్రాఫిక్ ఎస్.ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ చట్టంపై అవగాహనుండాలి

విశాలాంధ్ర-పమిడిముక్కల: గ్రామాల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు పంచాయతీరాజ్ చట్టం పై అవగాహన కలిగి ఉండాలని అప్పుడే ప్రణాళికాబద్ధంగా పాలన సాధ్యపడుతుందని ట్రైనింగ్ మేనేజర్ ధర్మారాజు అన్నారు.శనివారం పమిడి ముక్కల్లో గత మూడురోజులుగా సర్పంచ్ లకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు హాయం లో పనిచేశానని మనకు ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి పై దృష్టి సారించాలని తాగునీరు, డ్రైనేజీ వీధిలైట్లు పై ప్రజలు ఆధారపడతారని వారి అవసరాలను తీర్చే బాధ్యత సర్పంచ్ లు కార్యదర్శులదేనని తెలిపారు.ఆయన పౌరాణిక గేయాలు అలరించాయి.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ షేక్ సుభాని పలువురు సర్పంచులు కార్యదర్శులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి తీసుకురావాలి

విశాలాంధ్ర-కూచిపూడి : గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరులను సమకూర్చే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం (సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్) లను తిరిగివినియోగం లోకి తీసుకురావాలని ఎండిఓ జి చంద్రశేఖర రావు సూచించారు. మొవ్వ మండల పరిషత్ కార్యాలయం లో ఈనెల 8వ తారీకు నుంచి మండలంలోనిసర్పంచులకు, కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు ముగింపు రోజైన శనివారం మొవ్వ పంచాయితీ పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త నుంచిసంపద తయారీ కేంద్రాలపై అవగాహన కల్పిస్తూ మండలంలోని 10 నుంచి 12 కేంద్రాలు ఉపయోగం లో ఉన్నాయని మిగిలినవి స్తబ్దుగా ఉండి వాటి కోసం ఏర్పాటు చేసిన షెడ్లు సైతం నిరుపయోగంగా మారాయని పేర్కొంటూ సర్పంచుల చొరవతో వాటిని కూడా ఉపయోగపడే విధంగా తీర్చిదిద్ది ఆదాయ వనరులు పెంచుకోవాలని హితవుపలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కేంద్రాలను ప్రోత్సహిస్తూ చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. గ్రామపంచాయతీలలో వాహనాల ద్వారా తడి చెత్త,పొడిచెత్త వేరువేరుగా సేకరించి తడి చెత్తను కేంద్రాలలోని పిట్లు(ఖానాలు)లో వేసి వర్మి కంపోస్టు తయారీకి కృషి సల్పాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈ మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులలో ఎండిఓ తోపాటు ఈవోపీఆర్డి వీర్ల సీతారామరాజు, పంచాయతీరాజ్ ఏఈ బి రామారావు, ఆర్డబ్ల్యూఎస్ కె ఎస్ ఆర్ కే ప్రసాద్, పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శులు ఎం.ఎన్.ఎస్. మూర్తి (కోసూరు), కళ్ళేపల్లి సోమేశ్వరరావు (మొవ్వ) శాఖ పరమైన విషయాలలో ఇచ్చారు.

రోడ్డుపై గుంతను పూడ్చించిన పోలీసులు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : ముండ్లపాడు-పెనుగంచిప్రోలు ఆర్ అండ్‌బీ రోడ్డులో ఏర్పడిన భారీ గుంతను శనివారం పెనుగంచిప్రోలు పోలీసులు పూడ్చించారు. ఏఎస్ఐ శంకర్, ఎస్ బి హెడ్ కానిస్టేబుల్ గంగాధర్ ఈ పనికి కీలకంగా వ్యవహరించారు.

వెల్‌నెస్ సెంటర్‌కు మరిన్ని సౌకర్యాలు కల్పించాలి

– ఎంపీ డాక్టర్ పెమ్మసానికి విజ్ఞప్తి చేసిన ఏపీ సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం

విశాలాంధ్ర–గుంటూరు వైద్యం : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ప్రయోజనార్థం ఏర్పాటు చేసిన సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ పథకం (సీజీహెచ్ ఎస్) వెల్‌నెస్ సెంటర్‌కు మరిన్ని ఆరోగ్యపరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఏపీ సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం కో–ఆర్డినేటర్ గుమ్మడి సీతారామయ్య చౌదరి కోరారు. శనివారం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ తనిఖీకి వచ్చిన పెమ్మసానిని ఆయన కలిసి వారి సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. గుంటూరు వెల్‌నెస్ సెంటర్‌ను అప్ గ్రేడ్ చేయాలని, ఇక్కడ అన్ని వైద్య, పరీక్షా సదుపాయాలు కల్పించాలని మంత్రిని కోరారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలకు కలిపి ఒక్క వెల్‌నెస్ సెంటర్ మాత్రమే ఉన్నందున పెన్షనర్లు, ఉద్యోగులు తమ ఆరోగ్య అవసరాలకు ప్రతిసారి గుంటూరుకు రావడం వ్యయ ప్రయాసలతో కూడుకుందని ఆయన ఎదుట ఆవేదననే వ్యక్తంచేశారు. ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటానని మంత్రి పెమ్మ సాని చంద్రశేఖర్ సంఘం కో–ఆర్డినేటర్ సీతారామయ్యకు తెలిపారు. కార్యక్రమంలో సీజీహెచ్‌ఎస్ డాక్టర్లు ఎంసీహెచ్.కోటేశ్వర రావు, డి.తుకారామ్, బేగం అయోష, రామారావు, మురళీ తదితరులు ఉన్నారు.

ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర–పెదకాకాని : మండల పరిధిలోని ఆటోనగర్ కాంప్లెక్స్ సెంటర్ వద్ద ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ సెప్టెంబర్ 1, 2, 3 తేదీలలో విశాఖపట్నంలో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమితి సమావేశాలలో పోరాటాల రూపకల్పన చేసి దశాబ్దాల కాలంగా కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం తిరిగి అమలు చేయాలని ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని మన రాష్ట్రంలో విశాఖపట్నంలో ఉన్న ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయకుండా నిలుపుదల చేయుటకు ఆంధ్రప్రదేశ్‌లో భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునర్నిర్మించేందుకు, ఆటో కార్మిక రంగాన్ని పరిశ్రమగా గుర్తించి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి పావలా వడ్డీకే ఆటోలు ఇప్పించే విధంగా జాతీయ సమితి నిర్ణయాలు తీసుకొని పోరాట కార్యక్రమాలు నిర్ణయించేందుకు వీలుగా సెప్టెంబర్ మూడవ తేదీ నాడు జరిగే కార్మిక ప్రదర్శనలో గుంటూరు జిల్లా నుంచి సంఘటిత, అసంఘటిత కార్మికులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాటిబండ్ల డేవిడ్‌రాజు, రామిశెట్టి శ్రీనివాసరావు, పి.ఈశ్వరరావు, రామిరెడ్డి, జి.శ్రీనివాసరెడ్డి, నూకరాజు శివ పాల్గొన్నారు.

రాజ్యాంగ బద్ధమైన హక్కులను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వం

విశాలాంధ్ర–గుంటూరు వైద్యం : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ బద్ధమైన హక్కులను కాల రాస్తుందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలోవిమర్శించారు. న్యాయం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించకూడదన్నది ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. మోడీ పాలనలో ఎన్నికల సంఘం ప్రజా స్వామ్య బద్ధంగా కాకుండా నియంత పాలనను అమలు చేస్తున్నట్లుగా ఉందని ఆరోపించారు. ప్రధాన రాజకీయ పార్టీలుగా చలామణి అవుతున్న కొన్ని కార్పొరేట్ రాజకీయ పార్టీల కుట్రలో భాగంగానే ఇతర రాజకీయ పార్టీలను వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. న్యాయస్థానాలను ఆశ్రయించటానికి వీలు లేదనటం ప్రజాస్వామ్యం అవుతుందా అని ప్రశ్నించారు. ఆర్టికల్ 226 ఉద్దేశాన్ని ఎన్నికల సంఘం వక్రీకరిస్తుందని ఆరోపణలను ఎదుర్కొంటున్న ఎన్నికల సంఘం ముందే బాధితులు మొర పెట్టుకోవాలనటం ఎన్నికల సంఘానికి సబబు కాదని మేడా శ్రీనివాస్ హితవు పలికారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

విశాలాంధ్ర–గుంటూరు సిటీ: మతం ప్రాతిపదికన కాకుండా కులం ప్రాతిపదికన దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ గుంటూరు పట్టణ క్రైస్తవ సంఘాల సమాఖ్య ప్రతినిధులు రెవ జి.సతీష్ బాబు, పాదర్ చంద్రమోహన్ నుదురుపాటి ఆధ్వర్యంలో జాతీయ క్రైస్తవ నిరసన దినం పాటించారు. స్థానిక సెయిట్ మాథ్యూస్ వెస్ట్ పారిస్ చర్చి నుండి ఆంథోనీ వారి చర్చి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండ్ సతీష్ బాబు మీడియాతో మాట్లాడుతూ 1950 రాష్ట్ర పతి ఉత్తర్వులో 3వ పేరా తొలగించాలని డిమాండ్ చేశారు. దీని కారణంగా దేశంలో దళిత క్రైస్తవులు వివక్షతకు గురి అవుతున్నారని విమర్శించారు. దళిత క్రైస్తవులకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు విఘాతం కలిగించే అశాలను నిర్మూలించి క్రైస్తవులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై గత 70 యేళ్లుగా వివాదం జరుగుతూనే ఉంది. దీనిని వ్యతిరేకిస్తూ మతం ప్రాతిపదికన కాకుండా కులం ప్రాతిపదికపై అంద రికీ సమానంగా రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమ ంలో పాదర్ చంద్రమోహన్ నుదురుపాటి, క్రైస్తవ నాయకులు రెవ్ విల్సన్, రెవ చక్రధర్, రేవ్ ఆశీర్వాదం, మనోహర్, కార్పొరేటర్ బూసి రాజ్యలత, క్రైస్తవ నాయకులు కర్ర హానిక్ బెంజిమెన్, వివిధ సంఘాల పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర–మంగళగిరి : మంగళగిరి పట్టణ, రూరల్ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కార మార్గం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం మంగళగిరి పట్టణ పరిధిలోని ఈద్గాలో ఈ నెల 12న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించ నున్నారని తహశీల్దార్, నగరపాలక సంస్థ అధికారులు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ నాగలక్ష్మితో పాటు పలువురు అధికారులు పాల్గొంటారని చెప్పారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రెస్ క్లబ్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర–గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు కలెక్టర్ కార్యాలయం ప్రాంగణ ంలో గల ప్రెస్‌క్లబ్ పునరుద్ధరణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కమ్యూనిస్ట్ ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వర రావు(సంగం) ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గుంటూరు ప్రెస్ క్లబ్ విశాల మైన భవనంలో దీర్ఘకాలం పాటు జర్నలిస్టుల సంక్షేమంతో పాటు ప్రజా చైతన్యా నికి ఒక కేంద్రంగా ఉండిందని, అయితే గత కొన్నాళ్లుగా అక్కడ స్తబ్ద వాతా వరణం ఏర్పడిందని ఇటువంటి వాతావరణం తొలగించి గుంటూరు ప్రెస్ క్లబ్ కొనసాగింపు జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విద్యుత్ దీపాలతో ప్రకాశం బ్యారేజ్

విశాలాంధ్ర–తాడేపల్లి: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రకాశం బ్యారేజ్‌ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. దీంతో విద్యుత్ దీపకాంతులతో ప్రకాశం బ్యారేజ్ శోభాయమా నంగా కనువిందు చేస్తూ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. మరో వైపు విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుండి వచ్చి చేరుతున్న వరదనీటితో నిండు కుండలా జలకళతో కృష్ణమ్మ కళకళలాడు తోంది. దీనికి తోడు బ్యారేజ్ పిల్లర్‌లకు అమర్చిన రంగు రంగుల విద్యుత్ దీపాల కాంతలలో పరవళ్ళు త్రొక్కుతూ ప్రవహిస్తున్న కృష్ణమ్మ సొగసులను వీక్షిస్తోన్న సందర్శకులు పరవశంతో ముగ్ధులవుతున్నారు. స్థానిక ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల నుండి దుర్గమ్మ దర్శనార్థం విజయవాడ వచ్చే అశేష భక్తులు సైతం ఇంద్రధనస్సును చీరగా కట్టుకున్న రీతిగా రంగు రంగుల దీపకాంతులతో వెలుగొందుతున్న కృష్ణమ్మను చూసి సంబరపడుతున్నారు.

విజయకీలాద్రిపై ఘనంగా సుదర్శన స్వామి తిరునక్షత్ర మహోత్సవం

విశాలాంధ్ర–తాడేపల్లి : జై శ్రీమన్నారాయణ పరమహంస పరివ్రాజకులు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయరు స్వామి వారి మంగళాశాసనములతో విజయకీలాద్రి దివ్యక్షేత్రముపై శ్రీమన్నారాయణుడి శ్రీహస్తంలో ఆభరణంగాను, శత్రువులకు ఆయుధంగాను దర్శనమిచ్చే సుదర్శన స్వామి తిరునక్షత్ర మహోత్సవము శనివారం ఉదయం పంచామృత అభిషేకము సర్వరక్షాకర సుదర్శన హోమం, పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, తీర్థ ప్రసాద గోష్టితో కార్యక్రమం ఎంతో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

ఒరాఫో జ్యువెల్స్ షోరూం ప్రారంభం

విశాలాంధ్ర–గుంటూరు సిటీ: స్థానిక బ్రాడిపేటలో ఒరాఫో జ్యువెల్స్ బ్రాండ్ నూతన షోరూం ను బలగం సినిమా ఫేమ్, సినీ నటి కుమారి కావ్య కళ్యాణ్ రామ్, ఎమ్మెల్యే గల్లా మాధవి సంయుక్తంగా శనివారం ప్రారంభించారు. షోరూం డైరెక్టర్ కళ్యాణ్‌రామ్ మాట్లాడుతూ 2018లో తమ మొదటి షోరూంను హైదరాబాద్‌లో స్థాపించటం జరిగిందన్నారు. వ్యాపార విస్తరణలో భాగంగా తమ మూడవ షోరూంను గుంటూ రులో ప్రారంభించినట్టు తెలిపారు. వినియోగదారుల అభిరుచులను ఆకర్షించ డానికి అవసరమైన వెండి అభరణాలు రూపొందించడం జరిగిందని తెలిపారు. ప్రారంభోత్సవంలో వెండి ఆభరణాలు పైన గ్రాముకు రూ.50లు తగ్గింపు అందజేస్తున్నామన్నారు. నగర వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

200వ రోజుకు చేరిన అన్న క్యాంటీన్ సేవలు

విశాలాంధ్ర–దుగ్గిరాల : మండల కేంద్రమైన దుగ్గిరాల గ్రామం రైలుపేటలో రాష్ట్ర విద్యా, ఐటీ, కమ్యూనికేషన్ శాఖా మంత్రి నారా లోకేష్ సహకారంతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ విజయవంతంగా 200వ రోజు నిర్వహిస్తున్నారు. పేదలకు, బాటసారులకు, హమాలీలకు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి రైల్వే పనులు చేసుకుంటున్న కూలీ లకు అన్నదానం చేస్తూ ఎంతో ప్రయోజనకరంగా ఉండడం విశేషం. ఈ సందర్భంగా అన్న క్యాంటీన్‌లో ప్రత్యేక వంటకాలు చేసి ఆపన్నులకు అందించడం జరిగింది. మంగళగిరి నియోజకవర్గ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు వల్లూరు నరసింహారావు మాట్లాడుతూ ఇంతటి బృహత్తర పుణ్య కార్యక్రమం తెలుగుదేశం పార్టీ చేపట్టడం దానిలో లోకేష్ తెలుగుదేశం శ్రేణులకు సేవ చేసే అవకాశం ఇవ్వడం అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్కా చిరంజీవి, బొజ్జా బాలు, సక్రునాయక్ కన్నెగంటి నాగేశ్వరరావు, జున్నుఖాన్ పాల్గొన్నారు.

జీఎంసీ కమిషనర్‌గా శ్రీనివాసులు

విశాలాంధ్ర–గుంటూరు కలెక్టరేట్ : చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ప్రస్తుతం ఉన్న పి.శ్రీనివాసులుని గుంటూరు నగర కమిషనర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

'ఏఎన్‌యూ బోర్డు ఆఫ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ చైర్మన్'గా డాక్టర్ వెంకట శివలక్ష్మి గంటా

విశాలాంధ్ర–గుంటూరు వైద్యం : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆఫ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్ విభాగ చైర్మన్‌గా ఆర్‌వీఆర్ విద్యా కళాశాల లెక్చరర్ డాక్టర్ గంటా వెంకట శివలక్ష్మిని నియమిస్తూ ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ శివలక్ష్మి ఈ హోదాలో మూడు సంవత్సరాలు కొనసాగనున్నారు. తన నియామకానికి సహకరించిన ఏఎన్‌యూ అధికారులకు శివలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. ఎడ్యుకేషన్ బీఓఎస్ చైర్ పర్సన్‌గా శివలక్ష్మి నియామకం పట్ల బీఈడీ అధ్యాపకులు హర్షం వ్యక్తంచేశారు.

దోమలు... ప్రజారోగ్యానికి శత్రువులు

విశాలాంధ్ర–తెనాలి : తెనాలి ఐతానగర్ హయ్యర్ పేటలో డెంగ్యూ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ తెలిపారు. దోమలు ప్రజారోగ్యానికి ప్రథమ శత్రువులని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, నీటి నిల్వలు లేకుండా తగు జాగ్రత్త వహించాలని, డెంగ్యూ వ్యాధి నివారణ చర్యలు అవలంబించవలసిన చర్యల గురించి ప్రజలకు వివరించారు. ఆరోగ్యవిస్తరణాధికారి అందె బాల చంద్రమౌళి మాట్లాడుతూ వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతపై, అవగాహన కల్పిస్తూ, డెంగ్యూ వ్యాధి నిర్మూలిద్దామనే నినాదాలతో అవగాహన కలిగించడం జరిగిందన్నారు. డెంగ్యూ వ్యాధి నివారణ చర్యలు తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో మునిసిపల్ శానిటరీ సెక్రెటరీ సుదీప్, హెల్త్ అసిస్టెంట్స్ షేక్ నవీద్, షేక్ రషీద్, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి బేబీ, ఆషా కార్యకర్త మాలతి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, బైక్ రేసింగ్‌లపై ఎస్పీ కృషి అభినందనీయం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గంజాయి మత్తు పదార్థాల వినియోగం, విచ్చల విడి బైక్ రేసింగ్‌ల పైన ఉక్కుపాదం మోపటంలో గుంటూరు ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ కృషి అభినందనీయమని, ఈవ్‌టీసింగ్ ర్యాగింగ్ అణిచివేసేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌ని జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ కోరారు. గుంటూరు జిల్లా నూతన ఎస్పీగా గత నెలలో బాధ్యతలు స్వీకరించిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌ని రావిపాటి సాయికృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించి శుభా కాంక్షలు తెలియజేశారు. గత ప్రభుత్వం హయాంలో గుంటూరు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా క్రైమ్ రేట్ పెరిగిపోయింది అని కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలు అభద్రతాభావం నుండి ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నారని అన్నారు.

హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహార పంపిణీ

విశాలాంధ్ర-చిలకలూరిపేట : హెచ్ఐవీ బాధిత చిన్నారులకు ఆరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. రోష్ని సర్వింగ్ నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోష్ని సర్వింగ్ సొసైటీ అధ్యక్షుడు జిలాని బాష మాట్లాడుతూ ప్రతి రెండో శనివారం హెచ్ఐవీ బాధిత చిన్నారులకు, రెండో గురువారం హెచ్ఐవీ బాధితులకు ఆరోగ్య శిబిరాలు ఆరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నెహరాహిన్, అనిత, సుభాని, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నాక్లయింట్ అయిన రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ తెనాలి వారి తరుపున బ్రాంచ్ మేనేజర్ గారి సంజాయిషీ ప్రకారం యావన్మందికీ తెలియచేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్థి గుంటూరుజిల్లా, తెనాలి టౌన్, ఇస్లామ్‌పేట, డోర్ నెం:17-9-3 కాపురస్తులు కోలా జగదీష్‌బాబు గారి భార్య మాధవి గారికి ది.03-03-2021న యస్.ఆర్.ఓ.తెనాలిలో రిజిస్టర్ కాబడిన దఖలు దస్తావేజు నెం.1082/2021 ద్వారా దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి సంక్రమించియున్నది. అట్టి ఆస్థిపై కోలా జగదీష్‌బాబు మరియు మాధవి గార్లు నాక్లయింట్ వారి వద్ద నుంచి ఋణసౌకర్యంను అభ్యర్థించగా, నాక్లయింట్ మంజూరు చేసి వున్నారు. కావున షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరం వగైరాలు వున్న యెడల నాకు గాని, నా క్లయింట్ గాని ఈ ప్రకటన వెలువడిన తేది నుండి వారం రోజులు లోగా లిఖిత పూర్వకంగా వ్రాతపూర్వకమైన ఆధారాలతో క్రింద చిరునామాకు సంప్రదించవలెను. గడువు తదుపరి వచ్చిన అభ్యంతరములు నాక్లయింటును బైండుచేయజాలవు మరియు నిర్వివాద, నిష్పేచీ ఆస్థిగా భావించబడును.

షెడ్యూలు:గుంటూరు డి.,తెనాలి రి.డి.,తెనాలి సబ్ డి., యిలాకా, తెనాలి మున్సిపల్ 7వ వార్డు, 5వ బ్లాకు, టి.యస్. నెం.389రు య.0-28ట్లు మింజుమలె డోర్.నెం.17-9-3రుకు సమీపమున గల చ.గ.79లు నివేశన స్థలము అందలి ఆర్.సి.సి. బిల్డింగ్ ఆస్తికి **హద్దులు. తూర్పు**:కోటిరత్నం గారి ఆస్థి తాలూకు ప్రహరీగోడ హద్దు. అ.16-00లు, **దక్షిణం**:బాణాల వెంకటేశ్వర రావుగారి ప్రహరీగోడ హద్దు.అ.45-30లు,**పడమర**: మునిసిపల్ బజారు హద్దు.అ.15-09లు,**ఉత్తరం**:కంభం రమణమ్మ గారి ఆస్థి హద్దు. అ.45-30లు.

కె.యల్. క్రాంతి చైతన్య, అడ్వకేట్,
డోర్ నెం:4-30-6,ఐతానగర్,తెనాలి, గుంటూరు జిల్లా,సెల్:8790999098

CHANGE OF NAME

I, MURALI RAMNATH (Old Name),W/o.Late VASUDEV RAMNATH SINGH,resident of D.No.13-5-14/1,4th line, Gunturvari Thota, Guntur, Guntur Dist., Andhra Pradesh. I have changed my name as **VASUDEV MURALI RAMNATH** (new name) hereafter my name is known as **VASUDEV MURALI RAMNATH.**

పట్టాదారు పాస్ పుస్తకాలు పోయినవి

గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం ఫిరంగిపురం గ్రామం అల్లంవారి పాలెంకు చెందిన **గాలి థామస్‌రెడ్డి** మర్రెడ్డికి సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు పోయినవి. ఫిరంగిపురం సర్వే నెం-**517-బి1 3.50** సెంట్లు భూమికి సంబంధించి పట్టా నెం-**688** పాస్ పుస్తకాలు అల్లంవారి పాలెం నుంచి ఫిరంగి పురం వస్తుండగా మార్గం మధ్యలో పోయినవి. పాస్ పుస్తకాలు దొరికిన వారు మా అడ్రస్‌కు తెలియజేయగలరు.

గాలి థోమాస్‌రెడ్డి
ఫిరంగిపురం అల్లంవారిపాలెం
9885033735

నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక బృందావన్ గార్డెన్స్ స్పెన్సర్స్ బ్యాక్ సైడ్‌లో మాజీమంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ నూతన కార్యాలయాన్ని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మాజీ కేంద్ర మంత్రి జెడి శీలం, మాజీమంత్రి రావెల కిషోర్ బాబు శనివారం ఉదయం ఘనంగా ప్రారంభించారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు డొక్కా మాణిక్య వరప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన కార్యాలయ ప్రారంభోత్సవానికి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు లింగంశెట్టి ఈశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, జనచైతన్య వేదిక అధ్యక్షులు వల్లం రెడ్డి లక్ష్మణ్‌రెడ్డి, జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటే శ్వరరావు, ప్రముఖ న్యాయవాది కోటేశ్వరరావు, డొక్కాదివ్య, ఎంజెఎస్ఎస్ నాయ కులు పినపాటి మోహనరావు, పరంగి సత్యరాజు, ఏసీ లా కాలేజ్ కరస్పాండెంట్ గద్దం ఎలీషా, రిటైర్డ్ డీఐజీ బాల స్వామి, సీనియర్ నాయకులు రాధా మాధ, న్యాయవాదులు పరిస పోగు సునీల్, మహాకవి జాషువా కళా పిఠం కార్యదర్శి నూతక్కి సతీష్, క్రిస్టియన్ విభాగం రాష్ట్ర నాయకులు ఈరి రాజ శేఖర్, వీసీకే పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కె.జయ సుధ, రాష్ట్ర నాయకులు కట్టే పోగు ఉదయ భాస్కర్, వివిధ దళిత, బహుజన ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆఫ్రికన్ ఆర్థో సర్జన్స్‌కు మోకీలు మార్పిడిపై శిక్షణ

- అంగోలాలో తొలి రివిజన్ నీ సర్జరీ
- సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆఫ్రికన్ ఆర్థోపెడిక్ సర్జన్‌లకు ఇకపై సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మోకీలు, తుంటి మార్పిడి శస్త్ర చికిత్సలపై శిక్షణ ఇవ్వను న్నట్లు సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలి పారు. ఆఫ్రికన్ దేశాలలో అత్యంత వెనుకబడిన అంగోలాలో వారం రోజుల పర్యటన అనంతరం శనివారం డాక్టర్ నరేంద్రరెడ్డి విలేకరులతో మాట్లాడారు. అంగోల దేశ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ సిల్వియా పౌల లుటు కుట (Dr Silvia Paula Lutucuta) ఆహ్వానం మేరకు ఆ దేశంలోనే తొలిసారిగా రివిజన్ నీ రీప్లేస్ మెంట్ సర్జరీ నిర్వ హించడం జరిగింద న్నారు. నాలుగు రోజులు పాటు అక్కడి సీని యర్ ఆర్థోపెడిక్ సర్జన్లకు రివిజన్ నీ రీప్లేస్‌మెంట్‌పై శిక్షణ ఇచ్చామని, ఆఫ్రికన్ ఆర్థోపెడిక్ సర్జన్స్ సూచన మేరకు యువ వైద్యులకు గుంటూరులోని సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మోకీలు, తుంటి మార్పిడి ఆపరేషన్‌లపై శిక్షణ ఇవ్వనున్నామని చెప్పారు. ఈ మేరకు ఆఫ్రికన్ ఆర్థోపెడిక్ సర్జన్ సొసైటీలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. రానున్న కాలంలో రివిజన్ నీ రీప్లేస్‌మెంట్ సర్జరీలకు రాజధాని అమరావతి కేంద్ర బిందువుగా మారనున్నదని డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి అన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నీ ప్రారంభం

విశాలాంధ్ర-వినుకొండ : పట్టణంలోని గుడ్ షఫర్డ్ పాఠశాల ఆవర ణలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీలు శనివారం నుండి మూడు రోజుల పాటు నిర్వహించుచున్నారు. మొదటిరోజు నిర్వ హించిన పోటీల నందు 13 జిల్లాల నుండి 15 మహిళ జట్లు పాల్గొనగా వీరిలో విజయ నగరం, గుంటూరు, కడప, అనంతపురం, కర్నూలు, శ్రీకాకుళం, కృష్ణ, విజయనగరం పాల్గొని గెలుపొందారు, పురుషుల విభాగంలో 15 పురుషులు జట్లు పాల్గొనగా అనంతపురం, వెస్ట్ గోదావరి, అనంతపురం, ఈస్ట్ గోదావరి, నెల్లూరు, కడప, గెలుపొందారు. మొత్తం 30 జట్లులు పోటీ పడుతున్నాయని, ఇక్కడ గెలుపొందిన వారి లో నుండి రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసి,మహారాష్ట్ర లో జరిగే జాతీయ పోటీలకు పంపడం జరుగుతుందని, ఉమ్మడి గుంటూరు జిల్లా సాఫ్ట్ బాల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ నరసింహారెడ్డి తెలిపారు. అన్ని వసతులు కల్పించి సహకరిస్తున్న గుడ్ షెఫర్డ్ పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఇన్నారెడ్డి యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వినుకొండ పీడీలు చిరంజీవి, సురేష్, రాధా కృష్ణ, సుబ్బారావులకు కృతజ్ఞతలు తెలిపారు.

త్వరలో బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు : ఆలపాటి

విశాలాంధ్ర-తెనాలి : కూటమి పాలన ద్వారా రాష్ట్రంలోని బ్రాహ్మణులకు న్యాయం జరుగు తుందని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు శుక్రవారం రాత్రి తెనాలి నాజర్‌పేట లోని విద్యాశంకరభారతి నృసింహసదనంలో వేదిక్ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో బ్రాహ్మణ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షులు అమ్మన్ని సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జగన్ పాలనకు ప్రజలు బుద్ధి చెప్పాలని సంకల్పించుకోగా బ్రాహ్మణులు ఆశీర్వదించడంతో ఆ సంకల్పానికి బలం చేకూరి కూటమి ప్రభుత్వం ఏర్పడిందన్నారు.ఏలూరి బ్యాంకు మేనేజర్ ఎన్‌వీఆర్ శేషు కుమార్ మాట్లాడుతూ బుక్స్ పంపిణీ కార్యక్రమానికి తనను భాగస్వామ్యులుగా చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణ మూర్తి, ఏలూరి బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ కామరాజు రవి, మోహన్, భాగవతుల కామేశ్వరరావు, పుల్లే సూర్యప్రకాష్ రావు, ఆర్.రాజేంద్రప్రసాద్, టి.దక్షిణామూర్తి, కేవీ సుబ్రహ్మణ్యం, సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫై కేర్ డేటా సెంటర్ పరిశీలన

విశాలాంధ్ర-మంగళగిరి: మంగళగిరి నగర పరిధిలోని ఆటో నగర్‌లో గల ఫై కేర్ డేటా సెంటర్‌ను శనివారం కేంద్ర గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పరిశీలించారు.టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టిడిపి పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు,టిడిపి రూరల్ అధ్యక్షులు తోట పార్థసారథి, వాకా మాధవరావు, పిచ్చిరెడ్డిలతో పాటు పలువురు టిడిపి, జనసేన, నేతల పాల్గొన్నారు.

బహిరంగ పకటన

నా క్లయింట్ అయిన యన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ, పడమట లంక, నేతాజీ స్ట్రీట్, డోరు నెం. 40-25-18/1ఎరు కాపురస్తులు లేటు వజ్జా వెంకటేశ్వర రావు గారి కుమార్తె పోలవరపు ధన రాజ్యలక్ష్మి (సెల్ : 81255 60249) గారి సంజాయిషీని పొంది, యావన్మందికి తెలియచేయునది.

నా క్లయింట్‌కు తండ్రి వజ్జా వెంకటేశ్వర రావు గారి పేరిటకు ది. 07.11.1989న గుంటూరు జిల్లా రిజిస్ట్రారు ఆఫీసులో విక్రయ దస్తావేజు నెం. 7057/1989రుగా రిజిష్టరు కాబడినది. కాగా సదరు ఒరిజినల్ దస్తావేజును నా క్లయింట్ ది. 01.08.2024న ఒక కవర్‌లో పెట్టుకొని గుంటూరు జి.జి.హెచ్ పాత బిల్డింగ్ వద్ద ఆటో ఎక్కి నాజ్ సెంటర్‌నకు వెళుచుండగా మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినది. సదరు దస్తావేజు ఎవరికెనా దొరికిన యెడల నాకు గానీ, నా క్లయింట్‌కు గానీ తెలియచేయగలరు. అలాకాకుండా సదరు దస్తావేజును ఎవరెనా దుర్వినియోగ పరిచిన యెడల నా క్లయింట్ తీసుకొను చట్టపరమెన చర్యలకు బాధ్యుల గుదురు. సదరు ఆస్థి విషయమె ఎవరికెనా ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్న యెడల ఈ ప్రకటన ప్రచురితమెన తేదీ నుండి 15 రోజులలోగా తెలియచేయగలరు.

సిద్దా సత్యనారాయణ రావు
అడ్వకేట్, అడస్ : సీలంవారి స్ట్రీట్, కొత్తపేట, గుంటూరు. సెల్ : 94415 04506

VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

యూనిట్ 203 & 204, 2వ అంతస్తు, "ఎ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సెవ్రి (పశ్చిమ), ముంబై 400015. మహారాష్ట్ర. సిఐఎన్ నం.:U65922MH2005PLC272501

సెక్యూరిటైజేషన్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు

వీహెచ్ఎఫ్‌సిఎల్ నుండి పొందిన పరపతి సౌకర్యాల యొక్క వడ్డీని చెల్లించడంలో మరియు అసలు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. అందుచేత సదరు పరపతి సౌకర్యాలు నిరర్థక ఆస్తులుగా మారాయని వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ముంబైలోని దాని ప్రధాన కార్యాలయం ద్వారా ఈ క్రింది రుణగ్రహీతలు / హామీదారులు / తనఖాదారులకు నోటీసు జారీ చేయడమైనది. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) కింద వారికి ఈ నోటీసులు జారీ చేయబడ్డాయి, అయితే అవి వారికి అందజేయబడక తిరిగి వచ్చినందున బహిరంగ నోటీసు మార్గంలో వారికి దీని గురించి తెలియజేయడమైనది.

రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు మరియు లోన్ ఎక్కౌంట్ నం.	సెక్షన్ 13(2) కింద డిమాండ్ నోటీసు తేదీ మరియు బకాయి	తనఖాపెట్టబడిన ఆస్తి యొక్క వివరాలు
చిన్న కోటేశ్వరరావు పావులూరి (రుణగ్రహీత) నరసమ్మ పావులూరి (సహ-రుణగ్రహీత) LP0000000058387	20-జులై-24/ తదుపరి వడ్డీ మరియు దానిపై చార్జిలతో 15-జులై-24 నాటికి రూ.646143/-	ఆంధ్రప్రదేశ్-522413, గుంటూరు, పిడుగురాళ్ల, గుంటూరు జిల్లా పిడుగురాళ్ల మండలం, గుత్తికొండ గ్రామ పంచాయతీ డోర్ నం.7-191, గుత్తికొండ యొక్క డి.నం.751లో ఉన్నది. 800 చదరపు అడుగులతో 96.8 చదరపు గజాల విస్తీర్ణపు భూమి. హద్దులు: ఉత్తరం: పావులూరి శ్రీనివాసరావుకు పోయిన వాటా ఆస్తి ; దక్షిణం: బజార్, పడమర: బజార్.

నోటీసు సర్వీసుకు ప్రత్యామ్నాయంగా ఈ చర్యలు తీసుకోబడును. ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి 60 రోజులలోపు మొత్తం బకాయిలు చెల్లించవలెనని పై రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు మరియు/లేదా వారి హామీదారులు (ఎక్కడైనా వర్తించే చోట)కు సూచించడమైనది. విఫలమైన పక్షంలో ఈ నోటీసు తేదీ నుంచి 60 రోజుల గడువు ముగిసిన తర్వాత సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయి. దయచేసి పేర్కొన్న నోటీసు సెక్షన్ 13(13) ప్రకారం రుణగ్రహీతలకు/గ్యారంటీదారులకు/ తనఖా పెట్టిన ఆస్తిని విక్రయించరాదని/లీజుకు ఇవ్వకూడదని/బదిలీ చేయరాదని తెలియజేసిందని తెలియజేయండి. చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం పైన పేర్కొన్న తనఖాపెట్టిన ఆస్తిని విక్రయించరాదని/లీజుకు ఇవ్వకూడదని/బదిలీ చేయరాదని రుణగ్రహీతలకు/ హామీదారులకు/తనఖాదారులకు తెలియజేసినట్లు కూడా దయచేసి పేర్కొన్న నోటీసును భావించవలెను.

తేదీ: 11.08.2024
ప్రదేశము: గుంటూరు

అధీకృత అధికారి,
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

దుగ్గిరాల ప్రధాన రహదారికి మహర్దశ

విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల కేంద్రమైన దుగ్గిరాల గ్రామానికి మహర్దశ పట్టింది. ఎన్నో దశాబ్దకాలం నాటి నుంచి గ్రామంలో ఉన్న ప్రధాన రహదారిని పట్టించుకోకపోవడంతో గుంతలు ఏర్పడి వాహనదారులు నానా ఇబ్బందులు పడేవారు. నిత్యం వందలాదిగా గ్రామంలోకి వెళ్లే వాహనాలు రాకపోకలు జరగడంతో వాహనదారులు నానా అవస్థలకు గురయ్యేవారు. నేడు ఆ ఇబ్బందులు తొలగిపోవడంతో గ్రామస్తులు, వాహన దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు దుగ్గిరాల పాతలాకుల వద్ద నుంచి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి పనులు అధికారులు శనివారం ప్రారంభించారు. టీడీపీ నాయకులు ప్రొక్లెయిన్‌తో జరుగుతున్న రోడ్డు పనుల తీరును పరిశీలన చేశారు. గత ప్రభుత్వంలో ఎన్నో హామీలు ఇచ్చి నెరవేర్చ లేదని, నేడు మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా, శరవేగంతో జరగడంతో గ్రామస్తులు, నాయకులు వాహనచోదకులు లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటరావు, నియోజకవర్గ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు వల్లూరు నరసింహారావు, నక్కు చిరంజీవి, నూకతోటి రవి, పఠాన్ జున్ను ఖాన్, కన్నెగంటి నాగేశ్వరరావు, బొజ్జ బాలుయాదవ్, పేర్లి వంశి, లియో పాల్గొన్నారు.

త్వరలోనే పల్నాడు కల సాకారం : ఎమ్మెల్యే జీవీ

విశాలాంధ్ర- వినుకొండ : కరవు నివారణ ప్రాజెక్టుకు తండ్రి పేరు పెట్టుకుని మరీ పల్నాడును ఎండ బెట్టిన ఘనుడు మాజీ ముఖ్య మంత్రి జగన్‌రెడ్డి అని తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనే యులు ధ్వజమెత్తారుజవైజన్ తెలుగుదేశం పార్టీ గత ప్రభుత్వం హయాంలోనే ప్రారంభించిన ప్రాజెక్టుకు కనీసం రూపాయి కూడా ఇవ్వకుండా, కిలోమీటర్ పని కూడా ముందుకు తీసుకుని వెళ్లకుండా ప్రాజెక్టును నిర్వీర్యం చేశారని మండిపడ్డారాయన. అత్యంత వెనకబాటుకు చిరునామాగా ఉన్న పల్నాడు ప్రాంతంలో 4 జిల్లాల రైతులకు నీళ్లిచ్చే ఈ పథకానికి ఐదేళ్లు మోకాలడ్డారని తండ్రి పేరు పెట్టుకుని కూడా పైసా పని చేయని వ్యక్తి జగన్ అని దుయ్యబట్టారాయన. పల్నాడు కరవు కష్టాలు తీర్చడానికి నదుల అను సంధానం ఒక్కటే మార్గమని, అందులో పెన్నా- గోదావరి లింకింగ్ కీలకమని మొదట గుర్తించింది. ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించింది ముఖ్య మంత్రి చంద్రబాబే అన్నారు. ఆ దిశగానే గత ప్రభుత్వంలోనే అన్ని ఏర్పాట్లు చేసి, కాంట్రాక్టర్లను నియమించి పనులు ప్రారంభించినా వాటిని మూలకు చేర్చిన వ్యక్తి జగన్ అన్నారు. తర్వాత పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా జగన్‌రెడ్డి వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ పల్నాడు కరవు నివారణ ప్రాజెక్టుపై దృష్టి సారించడం సంతోషం కలిగిస్తోందని, త్వరలోనే కరవు నివారణ ప్రాజెక్టు పూర్తి, పచ్చని పల్నాడు స్వప్నం సాకారం అవుతోందనే నమ్మకం కలుగుతోందన్నారు. పల్నాడును కృష్ణా, గోదావరి జలాలతో సుభిక్షం చేయాలనే చంద్రబాబు సంకల్పం అని అందుకు అనుగుణంగా యుద్ధప్రాతిపదికన పల్నాడు కరవు నివారణ ప్రాజెక్టును పూర్తి చేస్తామని తెలిపారు.

టైల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు రాక

విశాలాంధ్ర-రెంటచింతల: సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టైల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు ఎగువన వున్న సాగర్ నుంచి వచ్చి చేరుతుందని ఎస్ఈ కొలేగుండ్ల వెంకటరమణ చెప్పారు. సాగర్ నుంచి 3 లక్షల 41 వేల 866 క్యూసెక్కుల నీరు వస్తుండగా ప్రాజెక్టు కున్న12 గేట్లను 5.5 మీటర్ల ఎత్తి 3 లక్షల 41వేల 340 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్లో 74.08 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.26 టీఎంసీలకు సమానమన్నారు.

చిత్రకారుడు జస్టిస్‌కు సన్మానం

విశాలాంధ్ర-సత్తెనపల్లి: చిత్రకారుడు జాతీయ చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్ కు అంతర్జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి, భారతీయ చిత్రకళారత్న అవార్డు, కర్ణాటక కుంచె గురు అవార్డు మరియు లాగోస్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ వారి గౌరవ డాక్టరేట్ పొందిన సందర్భంగా సత్తెనపల్లి కళా మిత్రమండలి ఉషోదయ కళాపరిషత్ రోటరీ క్లబ్ సత్తెనపల్లి సంయుక్త ఆధ్వర్యంలో జస్టిస్‌కు స్థానిక శాంతినికేతన్ కళాశాల ప్రాంగణంలో ఆత్మీయ అభినందన సభ జరిగింది. రోటరీ క్లబ్ అధ్యక్షులు మాతంగి సాంబశివరావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పలు ప్రభుత్వ అవార్డు గ్రహీత పట్టాభి కళా పీఠ అధ్యక్షులు తూములూరి రాజేంద్రప్రసాద్ విచ్చేశారు. స్థానిక ఉషోదయ పరిషత్ అధ్యక్షులు పిన్నమనేని పాములయ్యకి గురు సత్కారం జరిగింది. మద్ద వెంకటస్వామి గుంటూరు జిల్లా సంగీత కళాకారుల అధ్యక్షులు అప్కా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు లాంవర్ధన రావు, ఏఐటీయుసి పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కంబాల శ్రీనివాస్. గుర్రం జాషువా సాహితీ సేవా సంస్థ అధ్యక్షులు పి ఇర్మియ పాల్గొన్నారు.

వైద్యులు తొమ్మిది గంటలకు విధులకు హాజరవ్వాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు వైద్యులు తప్పని సరిగా విధుల్లో ఉండాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆదేశించారు. శనివారం జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్ విభాగాధిపతులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. జనరల్ సర్జరీ విభాగంలో ఆ విభాగం హెచ్ఓడి, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ వైద్య విద్యార్థులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆపరేషన్ థియేటర్‌కు వచ్చిన ప్రతి కేసును ఉదయం తొమ్మిది గంటలకే మొదటి కేసుగా పరిగణలోకి తీసుకుని ఆపరేషన్లు చేయాలన్నారు. ఈ కేసులన్నీ సీనియర్ వైద్యులు చేపట్టాలని, ఆపరేషన్ థియేటర్ వచ్చిన కేసును వెంటనే ఆపరేషన్ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆపరేషన్లు వాయిదా వేసే పరిస్థితి రాకుండా చూడాలని ఆయన సూచించారు. ఆపరేషన్ థియేటర్‌లో ల్యాప్రోస్కోపీ మిషన్ కూడా అందుబాటులోకి తీసుకుని వచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని, ఆపరేషన్ థియేటర్ అందుబాటులో లేదని అత్యవసర ఆపరేషన్లను వాయిదా వేయవద్దని అయన అన్నారు. అత్యవసర ఆపరేషన్ల విషయం వాయిదా పడినట్లు సమాచారం ఇస్తే ఏదో ఒక విభాగంలోని ఆపరేషన్ థియేటర్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తానని ఆయన చెప్పారు. కొంత మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధులకు సరిగా రావడం లేదని, వారిపై చర్యలు తీసుకోవాలని, వారి స్థానంలో కొత్త వారిని నియమించాలని వైద్యులు చేసిన సూచనలు డిఎంఈకి పంపిస్తా మని హెచ్చరించారు. ఈ సమావేశంలో డాక్టర్ శైలజ, డాక్టర్ సుధీర్, డాక్టర్ వీరమ్మలు పాల్గొన్నారు.

విద్య బోధనలో ఆధునిక ప్రమాణాలు అవసరం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్య బోధించే ఉపాధ్యా యులు ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న ఆధునిక విద్య పాఠ్యాంశాలకు అనుగుణంగా తమని తాము మలుచుకుంటూ బోధించాలని తద్వారా పిల్లల సమగ్రాభివృద్ధికి పసితనంలోనే బాటలు వేసిన వారవుతారని నేషనల్ లీడర్‌షిప్ ప్రోగ్రాం గెస్ట్ ఫ్యాకల్టీ డాక్టర్ రాయ కె రమ పేర్కొన్నారు. శనివారం స్థానిక నగరంపాలెం ప్రజ్ఞ మెడి, టెక్నో విద్యాసంస్థలో ప్రీ ప్రైమరీ, ప్రైమరీ ఉపాధ్యాయులకు జాతీయ విద్యా విధానం, జాతీయ కర్రిక్యులం ఫ్రేమ్ వర్క్‌తో పాటు చైల్డ్ ప్రొటెక్షన్ చట్టంపై ఒక రోజు శిక్ష కార్యక్రమం ప్రముఖ విద్యావేత్తలచే నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న డాక్టర్ రాయ రమ మాట్లాడుతూ గత దశాబ్ద కాలంగా పాత మూస బోధనలకు భిన్నంగా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన జాతీయ విద్యా విధానంకు రూపకల్పన చేస్తున్నారన్నారు. పాఠశాల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసగాళ్ల పై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : సైబర్ నేరాలు రోజురోజుకు పెరిగిపోతు న్నాయని, మొబైల్, సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ లను ఉపయోగించి మోసాలకు పాల్పడుతున్న నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేఎల్ యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం ప్రజలకు సూచించారు. శనివారం ప్రాతూరు గ్రామంలో కేఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వలంటీర్లు ఇంటింటికి తిరిగి సైబర్ నేరాలు ఎలా జరుగుతాయి, వాటికి గురికాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ఓటీపీ మోసాలు, కేవైసీ మోసాలు, పెట్టుబడుల మోసాలు, పార్ట్ టైం జాబ్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, మొబైల్ సిమ్ అప్ గ్రేడ్, ఆన్‌లైన్‌లో లోన్లు వంటి కొత్త కొత్త నేరాలకు పాల్పడుతూ ప్రజలు మోసపోయామని తెలుసుకునేలోపే జరగాల్సిన నష్టం పోతుందని బీసీఏ విభాగాధిపతి డాక్టర్ కె.భగవాన్ తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు సేవా కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లను అభినందించగా పి.సురేష్, జి.చంద్రశేఖర్‌లు కార్యక్రమానికి సమన్వయ కర్తలుగా వ్యవహరించారు.

'సహస్ర ఆర్థో, న్యూరో సెంటర్'కు జాతీయ స్థాయి గుర్తింపు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : 'సహస్ర ఆర్థో, న్యూరో సెంటర్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని సహస్ర ఆర్థో, న్యూరో సెంటర్ అధినేత, ప్రముఖ ఆర్థోస్కోపీ, స్పోర్ట్స్ ఇంజురీ స్పెషలిస్ట్ డాక్టర్ శివ కుమార్ మామిళ్లపల్లి పేర్కొ న్నారు. మోకాలు, భుజం, క్రీడా గాయాలకు సంబంధించిన ఆర్థోస్కోపీ శస్త్ర చికిత్సలలో భారతదేశం అంతటా ఆర్థోపెడిక్ సర్జన్లకు శిక్షణ నిచ్చేందుకు ఇండియన్ ఆర్థోస్కోపీ సొసైటీ భారతదేశంలోని అతి కొద్ది కేంద్రాలలో ఒకటిగా మా కేంద్రం ఎంపిక చేయబడిందని తెలిపారు. ఆర్థోస్కోపీ రంగంలో ఆర్థోపెడిక్ సర్జన్లకు శిక్షణ ఇచ్చేందుకు ఇండియన్ ఆర్థోస్కోపీ సొసైటీ ద్వారా భారతదేశంలోని మొత్తం 31 కేంద్రాలకు గుర్తింపు లభించిందని, అందులో వైజాగ్ నుంచి ఒక కేంద్రం ఉండగా మరొకటి తమ సహస్ర ఆర్థో, న్యూరో సెంటర్ అని పేర్కొన్నారు. ఇకనుంచి సహస్ర ఆర్థో, న్యూరో సెంటర్‌లో ఆర్థోస్కోపీ, స్పోర్ట్స్ ఇంజురీస్ విభాగంలో ఆర్థోపెడిక్ సర్జన్లకు ఫెలోషిప్ శిక్షణను ప్రారంభిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ శిక్షణలో ఇచ్చే సర్టిఫికెట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంటుందని అన్నారు.

చంద్రబాబు సారథ్యంలో గిరిజన ప్రజలకు న్యాయం: ప్రత్తిపాటి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ఎన్డీఏ కూటమి సారథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గిరిజన ప్రజలకు మేలు జరుగుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శుక్రవారం రాత్రి ప్రపంచ ఆదివాసీల దినోత్సవ సందర్భంగా పట్టణంలోని పొట్టి శ్రీరాములు కాంప్లెక్స్‌లో గల మెడికల్ హాల్‌లో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్తిపాటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గిరిజన హక్కులు, వైద్య, ఉపాధి రంగాల్లో న్యాయం జరిగే విధంగా చంద్రబాబు నాయుడు కృషి చేస్తారని అన్నారు. గత ప్రభుత్వం రద్దు చేసిన పథకాలను పునరుద్ధరించి గిరిజన ప్రజలకు న్యాయం చేసేందుకు ఎన్డీఏ కూటమి సిద్ధమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్, ప్రధాన కార్యదర్శి కుంభ నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమైఖ్యా పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ చెరుకుపల్లి నిర్మల, టీడీపీ ప్రతిపక్ష నాయకులు గంగా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కందుల రమణ, సుగాలి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బి.శ్రీను నాయక్, గిరిజన సంఘం పట్టణ గౌరవ అధ్యక్షులు బి.చిన్న, అధ్యక్షులు పాలపర్తి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు దేవర డేవిడ్, కోశాధికారి బి.రాంబాబు నాయక్, ఏపీ ప్రైవేట్ కాంపౌండర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండ్రముట్ల నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

సీఐని సన్మానించిన జనసేన నాయకులు

విశాలాంధ్ర-దుర్గి: కారంపూడి సర్కిల్ నూతన సీఐగా టి.వి.శ్రీనివాసరావు ఉద్యోగ బాధ్యతలు చేపట్టి తొలిసారిగా దుర్గి పోలీసు స్టేషన్‌కు ఆయన విచ్చేశారు. సమాచారం తెలుసుకున్న జనసేన నాయకులు స్టేషన్‌కు వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. జనసేన నాయకులు సీఐ శ్రీనివాసరావును శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. సన్మానించిన వారిలో ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి పులి హరి, మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసరావు, దుర్గి పట్టణ అధ్యక్షుడు రుద్రాల రవి, సూరె బాల ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలు చట్టసభలు

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యున్నత వేదికలు చట్టసభలని, ఎన్నిక కాబడిన ప్రజాప్రతినిధులు విధిగా శాసనసభ సమావేశాలకు హాజరై ప్రభుత్వ విధానాల పై హేతుబద్ధంగా చర్చించాల్సిన బాధ్యత ఉంటుందని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ మాదాసు భాను ప్రసాద్ అన్నారు. మాజీ సీఎం ప్రతిపక్ష హోదా లేనంత మాత్రాన అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండటం, పత్రికా సమావేశాలకు పరిమితం కావటం సరైన నిర్ణయం కాదని అన్నారు. ప్రజలు కట్టే పన్ను డబ్బులు ఏ ఏ అంశాలకు ఖర్చు చేయాలి అనే విషయాన్ని చట్టసభల్లో నిర్ణయిస్తారనే విషయాన్ని గుర్తించాలన్నారు.

సీసీ రోడ్లు, డ్రెయిన్లకు శంకుస్థాపన

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరు పశ్చిమ నియోజక వర్గంలోని పలు డివిజన్లలో శని వారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకు స్థాపనలు చేశారు. 21వ డివిజన్ కోదండ రామయ్య నగర్ లోని 2,3 లైన్లు 600 మీటర్ల సీసీ రోడ్డుకు 80 లక్షల వ్యయంతో నిర్మించనున్నారు. అదేవిధంగా 28వ డివిజన్ లోని హౌసింగ్ బోర్డులో ఒక ఎకరం ప్రభుత్వ స్థలానికి 60 లక్షల రూపాయల వ్యయంతో ప్రహరీ గోడ నిర్మాణానికి, ఎన్జీవో కాలనీ ప్రధాన రోడ్డులో 350 మీటర్ల సిసి రోడ్డు, సైడు కాలువల నిర్మాణానికి 80 లక్షల రూపాయల అంచనాలతో పనులకు ఎమ్మెల్యే మాధవి శంఖుస్థాపన చేసి శిలాఫలకంను ఆవిష్కరించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు ఎక్కడున్నా కానీ దానిని రక్షించుకోవడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తెల్లగొర్ల అప్పారావు, మామిడి రామారావు, శివ నాగమల్లేశ్వరరావు, కసుకుర్తి హనుమంతరావు, నల్లూరి శీను బత్తుల సాంబశివరావు, శివాజీ, రవి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు మేలు చేసేలా ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

విశాలాంధ్ర-తెనాలి : అధికారంలోకి వచ్చిన 60 రోజులలో బ్రాహ్మణులకు మేలు చేసే విధంగా ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సంతోషకర మని తెనాలి బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు కోట పార్థసారథి అన్నారు. ఈ మేరకు తెనాలిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, దేవాదాయ శాఖ మంత్రి అనం రామ నారాయణ రెడ్డికి రాష్ట్రంలో ఉన్న అర్చకులు తరుపున ధన్యవాదాలు తెలియ జేశారు. ధూపదీప నైవేద్య పథకానికి రూ.5 వేలు నుంచి రూ.10 వేలు, జగనన్న గోరుముద్ద పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో మరుగు నపడిన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్‌కి నిధులు కేటాయించి పేద బ్రాహ్మణులకు ఆర్థిక చేయూత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరిషత్ సెక్రటరీ చింత పల్లి సాయి కిరణ్, ట్రెజరర్ కామరాజుగడ్డ రామచంద్రమూర్తి, ఉపాధ్యక్షులు కాజా శ్రీనివాస్, బీమరాజు సురేష్, కొండెపి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్‌కి సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు

విశాలాంధ్ర-అమరావతి : అమరావతి మండల పోలీస్ సర్కిల్‌కి నూతనంగా సీఐగా ఎం శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రావు మాట్లాడుతూ ఒంగోలులోనే డీటీసీ నుంచి నూతనంగా అమరావతి సీఐగా బాధ్యతలు స్వీకరించినట్టు తెలిపారు. నిత్యం యాత్ర స్థలంగా ప్రసిద్ధి చెందిన అమరావతిలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తా న్నారు. పదవి బాధ్యతలు చేపట్టిన సీఐ శ్రీనివాసరావును పోలీస్ సిబ్బందితో పాటు ఉన్నతాధికారులు పలువురు అభినందించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

విశాలాంధ్ర-నూజెండ్ల: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా అధికార యంత్రాంగం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తు న్నదని మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.వీరభద్రాచారి అన్నారు. అన్ని గ్రామాలలో పారిశుద్ధ్య పనులు శనివారం చేపట్టారు. ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి : గాదె

విశాలాంధ్ర-మాచర్ల: జనసేన నాయకుల అంతా ఐక్యంగా పార్టీ బలోపేతా నికి కృషి చేయాలని ఆ పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వర రావు అన్నారు. నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదులో భాగంగా మాచర్ల నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వాల నమోదుకు కృషి చేసిన గుండాల రవి, రుద్రాల రవి లను దుశ్శాలు వాలతో సత్కరించి ఆయన అభినందించారు. పార్టీ కార్యక్రమాలను ఎప్పటికప్పుడూ గ్రామస్థాయిలో తెలియజేయాలన్నారు. సభ్యత్వాల నమోదులో వాలంటీర్ల కృషి అభినంద నీయమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ కల్పించాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు: పెదకూరపాడులో పల్నాడు ఎక్స్ప్రెస్‌కు హాల్ట్ కల్పించాలని కోరుతూ అరసం రాష్ట్ర కార్యదర్శి కె శరచ్చంద్ర జ్యోతి శ్రీ, సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాస రావు రైతు సంఘం సహాయ కార్యదర్శి దర్శి శేషారావు సంత కాల సేకరణ నిర్వహించారు. శనివారం వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెదకూరపాడు మండలంలోని లగడపాడు, లింగంగుంట్ల, పాటి బండ్ల అబ్బరాజుపాలెం తాళ్లూరులో సంతకాల కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ వివిధ వర్గాల ప్రజల నుండి పెద్ద ఎత్తున స్పంది స్తున్నారు. పెదకూరపాడు పరిసర గ్రామాల నుండి పెద్ద ఎత్తున ఉపాధి కొరకు సికింద్రాబాద్‌లో నివాసం ఉంటున్నారు. వారి బంధు వులు, తల్లిదండ్రులు సొంత ప్రాంతాల్లో ఉంటున్నారు. పెదకూర పాడు నుండి చిరు వ్యాపారులు పెద్ద ఎత్తున ఇతర ఇతర ప్రాంతా లకు వలస వెళ్తూ ఉంటారు. ఈ రైళ్లు హాల్ట్ లేకపోవడం వల్ల వారందరికీ ప్రయాణం భారంగా మారింది. సికింద్రాబాద్-రేపల్లె ప్యాసింజర్ రైలుకీ కూడా హాల్ట్ కల్పించాల న్నారు. ఆయా గ్రామాల ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్తీక్‌ను అభినందించిన ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య

విశాలాంధ్ర-పెదనందిపాడు : ఆంధ్రప్రదేశ్ కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గుంటూరు టీజేపీఎస్ కళాశాలలో శనివారం నిర్వ హించిన నాలుగు కిలోమీటర్ల మార థాన్(రన్నింగ్) పోటీలలో ద్వితీయ స్థానం సాధించిన స్థానిక పీఏఎస్ కళాశాల బీకాం విద్యార్థి పి.కార్తిక్‌ని ప్రిన్సి పాల్ వీరరాఘవయ్య అభినందించారు. జిల్లా లెప్రసీ అధికారి శ్రీనివాస్ నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాన్ని కార్తీక్‌కి అందించడం జరిగిందని తెలిపారు. తదుపరి రాష్ట్రస్థాయిలో జరుగు పోటీలలో కార్తీక్ పాల్గొంటారని ఆయన తెలియజేశారు. కార్తీక్‌కి కళాశాల అధ్యక్షులు కాళహస్తి సత్యనారాయణ, పాలకవర్గ సభ్యులు, ఎన్‌సీసీ ఇన్‌ఛార్జ్ పాతూరి శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థులకు సమదుస్తులు పంపిణీ

విశాలాంధ్ర-సత్తెనపల్లి : నాయకుని పేరిట జన్మదిన వేడుకలు నిర్వహించటం అనవాయితీ అని, కానీ సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ పేరిట ప్రజలు, సంస్థలు స్వచ్ఛందంగా సేవా కార్యక్ర మాలు నిర్వహించటం ఎంతో గొప్ప విషయమని మాజీ మునిసిపల్ చైర్మన్ యల్లినేడి రామస్వామి అన్నారు. శనివారం స్థానిక వేద కళాశా లలో కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకల్లో భాగంగా విద్యా ర్థులకు ఉచితంగా సమ దుస్తులు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు కళాశాల డైరెక్టర్ చింతాడ రమేష్ అధ్యక్షత వహించారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది ఉల్లం శేషగిరిరావు మాట్లాడుతూ సత్తెనపల్లి ప్రాంతంలో ఎందరో నాయకులను చూసామని, కానీ కన్నా లక్ష్మీనారా యణపై ప్రజలకు అపారమైన అభిమానం ఉన్నదనటానికి వేద కళాశా లలో జరిగిన కార్యక్రమం ఉదాహరణ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు పూజల వెంకట కోటయ్య, మొక్కపాటి రామచంద్రరావు, తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ అధ్యక్షులు చలపతిరావు, అపోవా అధ్యక్షులు దివ్వెల శ్రీనివాసరావు, జనసేన నాయకులు కొమ్మిశెట్టి సాంబశివరావు, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు మద్ది వెంకటేశ్వ రరావు, కళాశాల అకడమిక్ డైరెక్టర్ చింతాడ సూర్యప్రకాష్, అధ్యాప కులు నాగరాజు, విక్రమ్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని గజాపురంలో శనివారం దుర్గి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వలపా పెద్ద సైదులు పాల్గొని రోగులకు పరీక్షలు నిర్వహించి, అవసరం మేరకు ఉచితంగా మందులు అందజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గిరిజన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పీహెచ్‌సీలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రవికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గజాపురంలో వైద్య శిబిరం నిర్వహించారు. 17న రాజానగర్‌లో వైద్య శిబిరం జరుగుతుందని డాక్టర్ తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస రావు, హెల్త్ అసిస్టెంట్ సద్దుగురు బాబు, యోగ్యానాయక్, ఏఎన్ఎం శ్రీలక్ష్మీ, ఆశాలు పాల్గొని రోగులకు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు హనుమా నాయక్, బాలాజీ నాయక్, లాలు నాయక్, రోగులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన

విశాలాంధ్ర-మంగళగిరి : ఎన్నారై వైద్య కళాశాల, ఎన్ఎస్ఎస్ వారి ఆధ్వ ర్యంలో మనం మన పేరిట వైద్య విద్యార్థులకు శనివారం పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు అందరు కృషి చేయాలని అన్నారు. కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు విద్యా ర్థులు 50 రకాల పండ్ల మొక్కలను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రబోధ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఫణీంద్ర, ఫిజికల్ డైరెక్టర్ గురునాథం, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, కమ్యూనిటీ మెడిసిన్ వైద్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి బైపాస్‌లోని తెనాలి ఫ్లైఓవర్ వద్ద ఎస్ఎల్వీ అమరావతి ఫ్రైడ్ క్లబ్ హౌస్‌లో ఎయిమ్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనిటీ అండ్ ఫ్యామిలీ మెడిసిన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్ఎల్వీ గ్రూప్స్‌చైర్మన్ అండ్ సీఎండీ పి.శ్రీనివా సరాజు హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో మలేరియా, టైఫా యిడ్, హెచ్చి, ఆర్పిఎస్, హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించి అవసరమైన రోగు లకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎయిమ్స్ సీఎఫ్ఎం డిపార్ట్‌మెంట్ ప్రొఫె సర్ రాజీవ్ రోగులకు మందులు పంపిణీ చేశారు. చైర్మన్ శ్రీనివాస రాజు మాట్లా డుతూ ఎస్ఎల్వీలో పనిచేస్తున్న సుమారు 120 మంది వర్కర్స్‌కు ఎయిమ్స్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం అభినందనీ యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్వీ గ్రూప్స్ డైరెక్టర్ రంగరాజు, ఎయిమ్స్ సీనియర్ రెసిడెంట్ డాక్టర్ అనంత ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఇంటెలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర్య ఉద్యమం గురించిన చరిత్రపై విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు శ్రీకారం చుట్టినట్లు క్లబ్ వ్యవస్థాపకులు జి.శాంత మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదిన గుంటూరు కొత్తపేటలోని కాసు శాయమ్మ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ లో, 13న పట్టాభిపురం టీజేపీఎస్ కళాశాలలో, 14న లక్ష్మీపురం అభ్యుదయ మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆయా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ప్రముఖ ఉపన్యాసకులు సంగిరెడ్డి హనుమంతరెడ్డి హాజరై చరిత్రపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

మొదటి క్రాస్ ఓవర్ యుటిలిటి వెహికిల్ ఎంజి విండ్సర్

విశాలాంధ్ర విజయవాడ లబ్బీపేట: క్రాస్ ఓవర్ యుటిలిటి వెహికిల్ ఎంజి విండ్సర్ తమ విభాగంలోనే తొలిసారి ఏరో-లౌంజ్ సీట్స్ తో వినియోగదారులకు అందుబాటులోకి వచ్చినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. నైపుణ్యవంతంగా రూపొందించబడిన రిక్లైన్ కోణం దూర ప్రయాణాల్లో అయినా లేదా సిటీలో డ్రైవ్ కోసం ప్రయాణికులు స్టైల్‌గా విశ్రాంతి చెందడాన్ని నిర్ధారిస్తుందన్నారు. ఎంజి విండ్సర్ ఈ శ్రేష్ఠతను ప్రతిబింబిస్తోందన్నారు. విండ్సర్ కోటలో ఉంచిన అదే స్థాయి ఆధిక్యత విలాసాన్ని చూపించేలా కారులో ప్రతి అంశం ఖచ్చితంగా రూపొందించబడిందని నిర్ధారిస్తుందన్నారు. వాటి విలక్షణత, అనుసరణీయత వలన, సీయువీలు రోజూ ప్రయాణించడానికి లేదా వారాంతాల్లో విహారాలకు కుటుంబాలు ప్రయాణించడాన్ని నిర్ధారిస్తాయన్నారు. వాటి అత్యధిక గ్రౌండ్ క్లియరెన్స్ స్పీడ్ బంప్స్, గుంతలు, సమానంగాలేని ఉపరితలాలపై మెరుగ్గా ప్రయాణించడానికి అనుమతి యిస్తుంది. సాఫీ మరింత సౌకర్యవంతమైన డ్రైవ్‌ను కేటాయిస్తుందనీ వివరించారు.

జనసైనికుల సేవా భావం స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర అవనిగడ్డ : కొత్తపేట జనసైనికుల సేవా భావం స్ఫూర్తిదాయకం అని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ తనయుడు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ (రాజా) అన్నారు. శనివారం అవనిగడ్డ సివారు కొత్తపేట ఆర్ అండ్ బి ప్రధాన రహదారికి కృష్ణానది కరకట్టకు మధ్య రోడ్డు మార్జిన్‌లో దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలును, ముళ్ళకంపను, జంగిల్‌ను తొలగింపు పనులు కొత్త పేట జనసైనికుల ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ పనులను మండలి వెంకట్రామ్ పరిశీలించి మాట్లాడుతూ కొత్తపేటలో ఏ సమస్య ఉన్నా ఎం.ఎల్.ఎ మండలి బుద్ధప్రసాద్ దృష్టికి తీసుకువస్తూ పరిష్కారం దిశగా కృషి చేస్తున్న జనసైనికులను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. ఈ సందర్భంగా జనసైనికులను అభినందించారు. కొత్తపేట జనసైనికులను సేవా మార్గంలో నడిపిస్తున్న కొత్తపేట, తిప్పాలెం ఎం.పి.టి.సి సభ్యులు బొప్పన భాను, రామకోటిపురం వార్డు సభ్యులు అడపా ప్రభాకరరావులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

నిత్య అన్నదానికి రూ.10,116 అందజేత

విశాలాంధ్ర - గుడివాడ : పట్టణంలోని జగన్నధపురంలోని భూనీలా సమేత శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానమునకు నందివాడ మండలం నందివాడ గ్రామానికి చెందిన కొమ్మూరి వెంకయ్య నాయుడు అయన సతీమణి నాగమణి తండ్రి జ్ఞాపకార్థం శ్రీ స్వామివారి దేవస్థానమున శనివారం అన్నదానమునకు రూ. 10,116 అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీ స్వామి వారి శేష వస్త్రలు, తీర్థప్రసాదలు అందజేసినట్ల దేవస్థానం ఇఓ తెలిపారు.

ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ విద్యార్థుల ర్యాలీ

విశాలాంధ్ర-విజయవాడ: యుద్ధాలను నివారించి, ప్రపంచ మానవాళి వికాసానికి ఐక్యరాజ్యసమితి కృషి చేయాలని ఇస్ఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగితాల రాజశేఖర్ సూచించారు. 1945 మొదటి ప్రపంచ యుద్ధం కాలంలో జపాన్ దేశం లోని హిరోషిమా నాగసాకి నగరాల పై అమెరికా అణు బాంబులు వేయడం వల్ల ఆ ఘటనలో లక్షలాది మంది ప్రజలు మృత్యువాత పడగా, ఇప్పటికీ ఎనభై ఏళ్ళు దాటిన తర్వాత కూడా అక్కడి ప్రజలు పరిస్థితి అధ్వాసంగా ఉందని, మళ్ళీ మూడవ ప్రపంచ యుద్ధం వస్తే ప్రపంచం అతలాకుతలం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షులు పరుచూరి అజయ్ కుమార్, కార్యదర్శి మోతుకూరి అరుణ కుమార్ మాట్లాడుతూ పాలస్తీనా , ఇజ్రాయిల్ , ఉక్రయిన, రష్యా దేశాల మధ్య యుద్ధం నివారించడానికి కృషి చేయాలని అన్నారు. అన్ని దేశాల మధ్య వాణిజ్య శాంతి స్నేహ సహకారం అవరం ఉందని అన్నారు. మానవత సంస్థ చైర్మన్ వేమూరు బాబురావు, మాట్లాడుతూ యుద్ధాల వల్ల పేదరికం ఆర్థిక సంక్షోభం, అధిక ధరలకు ఆస్కారం ఉందని అన్నారు. పాఠశాల ప్రధాన అధ్యాపకులు మురాల శ్రీనివాసరావు, వ్యాయామ అధ్యాపకులు డి .రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కేరళ వరద బాధితులకు ఇస్ఫ్ విరాళం:

ఇటీవల భారీ వర్షాలు వరదల వల్ల కేరళ రాష్ట్రంలోని వాయదార్ జిల్లాలో అనేక కుటుంబాలు మృత్యు వాత పడగా వేలాది మంది నిరాశ్రయులయ్యారు, కోట్లాది ఆస్తి నష్టం సంభవించిన క్రమంలో వారి సహాయార్థం భారత స్నేహ, సాంస్కృతిక సహకార సంఘం (ఇస్ఫ్) జాతీయ సమితి పిలుపు మేరకు రాష్ట్రంలోను ,విజయవాడ నగరంలోను మిత్రుల ద్వారా సేకరించిన 25 వేల రూపాయలు అలాగే సంఘ పత్రిక మైత్రి నిర్వహణ కోసం 10 వేలు తొలి విడతగా ఇస్ఫ్ ఎపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగితాల రాజశేఖర్‌కు శనివారం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పరుచూరి అజయ్ కుమార్, మోతుకూరి అరుణకుమార్ లు అందజేశారు. వరద సహాయ నిధిని కేరళ ఇస్ఫ్ కమిటీకి పంపుతున్నట్టు రాజశేఖర్ తెలిపారు.

పంచాయతీ పాలనపై శిక్షణ

విశాలాంధ్ర - పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయములో పంచాయతి సర్పంచులు, పంచాయతి కార్యదర్శులకు రెండవ రోజు పంచాయతీ నిర్వహణ (పరిపాలన) విషయములో శిక్షణ కార్యక్రమం (రిఫ్రెషర్) శనివారం నిర్వహించారు. ఈ రెండవ రోజు శిక్షణ కార్యక్రమములో గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్యక్రమాలపై శిక్షణ యిచ్చారు. ప్రతి గ్రామం పరి శుభ్రముగా ఉండాలి అంటే స్వచ్ఛ షెడ్డు నిర్వహణ చేయ్యాలన్నారు. గ్రామం పరిశుభ్రముగా ఉండటమే కాక వర్మి కంపోస్టు ఉత్పత్తి చేసి తద్వారా గ్రామ పంచాయతి ఆదాయం పొందవచ్చు స్వచ్ఛ నిర్వహణ ఎస్ హెచ్ జి సభ్యుల బాగస్వామ్యం, ప్రజల భాగ సౌమ్యంతో జరిగేటట్లు ప్రజలకు అవగహన కల్పించాలి. అలాగే ప్రతి గ్రామ పంచాయతీలో ప్రతి 1000 మందికి ఒక క్లాప్ మిత్రను ఏర్పాటు చేసుకొని వారి ద్వారా గ్రామములోని చెత్తను సైకిల్ రిక్షా ద్వార సేకరించి స్వచ్ఛషెడ్ దగ్గర తడి చెత్త పొడి చెత్త గా వేరు చేసి తడి చెత్త నుండి వర్మి కంపోస్ట్ తాయారు చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమములో ఈఓ (పి ఆర్ అండ్ ఆర్ డి)ఎం డి వి. ప్రసాద్ , ఎన్ జి ఓ రామకృష్ణ మండల పరిషత్ పరిపాలన అధికారి కె . సిద్దా రెడ్డి , మేజర్ గ్రామ పంచాయతి సర్పంచ్ .వేల్పుల పద్మ కుమారి , కొనకంచి సర్పంచ్ .గోనెల దేవి పాల్గొన్నారు.

'అంబేద్కర్ గురించి మాట్లాడే అర్హత వైఎస్సార్సీపీ నేతలకు లేదు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర- నందిగామ: విజయవాడలో అంబేద్కర్ స్మృతివనంలో విగ్రహానికి ఉన్న జగన్ పేరును అర్ధరాత్రి ఎవరో ఆగంతకులు తొలగిస్తే వైసీపీ నేతలు సిగ్గులేకుండా నానా యాగీ చేస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ధ్వజమెత్తారు. అంబేద్కర్ విగ్రహంపై చిన్న గీత కూడా పడలేదని, కానీ అంబే ద్కర్ విగ్రహం ధ్వంసం చేస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేయటం సిగ్గుచేటన్నారు. దీన్ని ప్రభుత్వానికి ఆపాదించటం సరికాదని,ఆ ఘటనకు ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని చెత్తబుట్టలో పడేసి రాజారెడ్డి రాజ్యాం గాన్ని అమలు చేసిన ప్యూడలిస్టు జగన్‌రెడ్డి అన్నారు. రాజధాని నడిబొడ్డున 30 ఎకరాల విస్తీర్ణంలో అమరావతిలో చేపట్టిన స్మృతివనాన్ని అర్థాంతరంగా నిలిపివేసి రాజకీయ ప్రయోజనాల కోసం హడావుడిగా అంబేద్కర్ విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేశారన్నారు. అమరావతి అంబేద్కర్ స్మృతివనంలో అంబేద్కర్ విగ్రహాల్ని జగన్ పాలనలో ధ్వంసం చేశారన్నారు. రూ. 170 కోట్లతో చేపట్టిన అంబేద్కర్ విగ్రహం రూ. 404 కోట్లకు చేరింది. ఇందులో కూడా రూ. 258 కోట్లు వైసీపీ నేతలు స్వాహా చేసిన ఆరోపణలున్నా యన్నారు. గౌరవ అంబేద్కర్ పేరు కంటే పెద్ద అక్షరాలతో జగన్ పేరు పెట్టుకుని రాజ్యాంగ నిర్మాతనే అవమానించిన తీరుకు నిర సనగా కొందరు జగన్ పేరును తొలగించారు న్నారు. దళితుల లక్షలాది ఎకరాల అసైన్మెంట్ భూములను కాజేసిన దళిత ద్రోహి జగన్ పార్టీ అని విమర్శించారు.

లెనోవో 'బ్యాక్ టు కాలేజ్' ఆఫర్లు

విశాలాంధ్ర-విజయవాడ: అందరికి స్మార్ట్ టెక్నాలజీ అందించాలన్న ఉద్దేశంతో లెనోవా 'బ్యాక్ టు కాలేజ్' ఆఫర్లు ప్రకటించింది. ఈ ఆఫర్లు ఈనెల 18వరకు ఉంటాయి. విద్యార్థులకు అత్యుత్తమ సాంకేతికతను అందించడానికి ఈ ఆఫర్లు రూపొందించబడ్డాయి. విద్యార్థుల్లో ప్రీమియం పరికరాలపై ఉన్న డిమాండ్ దృష్ట్యా ల్యాప్‌టాప్‌లు, ఉపకరణాలపై తగ్గింపులను అందిస్తుంది. లెనోవా ఇటీవల నిర్వహించిన సర్వేలో కళాశాల విద్యార్థులకు సంగీతం, గేమింగ్‌లో అభిరుచి ఉన్నట్లు వెల్లడయింది. ఇందుకు మానిటర్‌లు, హెడ్‌సెట్‌లు, మౌస్లు సహా సమగ్ర గేమింగ్ పరికరాలు అవసరమని తేలింది. ఈ ఆఫర్లు అన్ని రిటైల్, ఈ-టెయిల్ ఛానెల్‌లో చెల్లుబాటు అవుతాయి. నోట్‌బుక్‌లు, డెస్క్‌టాప్‌లపై వర్తిస్తాయి. లెనోవా బైబ్యాక్ ప్రోగ్రామ్ యోగా, లెజియన్, ఎల్ఓక్యూ, స్లిమ్ 5, ఫ్లెక్స్ 5, ఏఐఓతో సహా వివిధ మోడళ్లపై ఆకర్షణీయమైన ధరలను అందిస్తుంది. విద్యార్థులు తమ పరికరాలను అప్‌గ్రేడ్ చేసుకోవడం సులభతరం చేస్తుంది. ప్రత్యేక బండిల్ ఆఫర్లలో రూ. 23,999 విలువైన లెజియన్ యాక్సెసరీలు రూ. 7,999 కు అందుబాటులో ఉన్నాయి. రూ. 999 నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక ధరలలో జేబీఎల్ క్లిప్ 4 ఎకో స్పీకర్‌ల ఎంపిక మోడల్‌లు ఉన్నాయి. లెనోవా కూడా రూ. 1,999 విలువైన సేవలను రూ. 2,999 అందిస్తుంది. దీని కింద కస్టమర్లు మూడేళ్ల పొడిగించిన వారంటీ, మూడేళ్ల ప్రీమియం కేర్, మూడేళ్ల యాక్సిడెంటల్ డ్యామేజ్ ప్రొటెక్షన్ (ఏడీపీ) పొందవచ్చు.

డ్రమ్ము వాయించి గిన్నిస్ రికార్డు

విశాలాంధ్ర/విజయవాడ లబ్బీపేట: పవిత్ర శ్రావణ మాసం సందర్భంగా ఉజ్జయినిలోని శక్తి పథ్ మహాకాల్ లోక్ వద్ద 1,500 మంది భక్తులు ఏకకాలంలో డ్రమ్ము వాయించి గిన్నిస్ రికార్డు సృష్టించారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ సహకారంతో మహాకాళేశ్వర్ ఆలయ నిర్వహణ కమిటీ 5న నిర్వహించిందనీ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ అసాధారణ ప్రయత్నాన్ని గుర్తించిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వేదికపై అధికారిక ప్రకటన చేసిందన్నారు. ఈ చారిత్రాత్మక విజయానికి అన్ని ప్రమాణాలను చేరుకునేలా ప్రపంచ రికార్డ్ కన్సల్టెంట్ నిశ్చల్ బరోట్ ఈ రికార్డు ప్రయత్నాన్ని రూపొందించి అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ ఉమేష్ నాథ్ జీ మహారాజ్, ఎంపీ అనిల్ ఫిరోజియా, ఉజ్జయిని ఉత్తర ఎమ్మెల్యే అనిల్ కలుహెడా, ఘటియా ఎమ్మెల్యే సతీష్ మాలవీయ, ఉజ్జయిని మేయర్ ముఖేష్ తత్వాల్, ఉజ్జయిని మున్సిపల్ కార్పొరేషన్ చైర్ పర్సన్ కళావతి యాదవ్, మున్సిపల్ జిల్లా చైర్మన్ వివేక్ జోషి, ఉజ్జయిని నార్త్ లెజిస్లేటివ్ అసెంబ్లీ కన్వీనర్ జగదీష్ పంచాల్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో రేవంత్‌కు ద్వితీయ స్థానం

విశాలాంధ్ర విజయవాడ స్పోర్ట్స్ : శారదా విద్యా సంస్థల్లో జూనియర్ ఇంటర్ ఎంపీసీ చదువుతున్న విద్యార్థి ఎం. రేవంత్ ఈ నెల 4 నుంచి 5 వ తేది వరకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సాఫ్ట్ టెన్నిస్ ఇండివిడ్యువల్ సింగిల్స్ పోటీలలో ద్వితీయ స్థానాన్ని సాధించాడు. తమ విద్యార్థి యమ్. రేవంత్ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సాఫ్ట్ టెన్నిస్ ఇండివిడ్యువల్ సింగిల్స్ పోటీలలో ద్వితీయ స్థానాన్ని సాధించడం తమకు ఎంతో గర్వంగా ఉందని, ఇకపై జరిగే పోటీలలో మరెన్నో పథకాలను సాధించి ప్రథమ స్థానంలో నిలవాలని, విద్యార్థులు అటు చదువుతో పాటు ఇటు ఆటలలో ఆసక్తిని చూపించాలని తెలుపుతూ శారద విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వై రమేష్ బాబు మేనేజింగ్ డైరెక్టర్ వై. శారదాదేవి యమ్. రేవంత్‌ను అభినందించారు. యమ్. రేవంత్ రాష్ట్ర స్థాయిలోనే కాక, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రథమవిజేతగా నిలవాలని అభినందించారు. అంతేగాక ఆటలతో మానసిక మరియు శారీరక ఆహ్లాదకరమైన ఆరోగ్యాన్ని పొందవచ్చని కళాశాల అడ్వైజర్ ఈ.యస్.ఆర్.కె.ప్రసాద్, కళాశాల జి.యమ్.జి.వి రావుతెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులు యమ్. రేవంత్‌ను అభినందించారు.

అనాధ పిల్లలకు పోషకాహారం పంపిణీ

విశాలాంధ్ర -విజయవాడ (వన్ టౌన్) : డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ ఆధ్వర్యాన పేద అనాధ పిల్లలకు పౌష్టికాహార పంపిణీ బీఆర్‌టీయస్ రోడ్డున హెల్పింగ్ టుగదర్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఉషారాణి పాల్గొని మాట్లాడుతూ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటి వారు పేద అనాధ పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్ అనాధ పిల్లలు ఉద్దేశించి మాట్లాడుతు ఏదైన సమస్యలు వైద్య అధికారి దృష్టికి తీసుకొని వెళ్ళాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగమల్లేశ్వరి, సొసైటి ప్రధాన కార్యదర్శి కె.రాము,కోశాధికారి గుర్రం ఏడుకొండలు, షఫి ఉల్లరహీమ,డి పి యమ్ కిరణ్,నాగార్ బి పాల్గొన్నారు.